

KADILIMCHE VAARTHA Telugu daily

కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

బ్యూరో చీఫ్ జోడు రమేష్ కుమార్, కడప జిల్లా, అన్నమయ్య జిల్లా సంపుటి : 11 సంచిక : 245 శుక్రవారం 04 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : 05

Published From Kadapa : Circulated at | Ananthapuram | Tirupati | Vishakapatnam | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Vijayawada | Ongole | Chittore | Khammam | Hyderabad | Mahabubnagar

## వివేకా హత్య కేసులో
# ఈడీ దూకుడు

- రూ.40 కోట్ల డీల్‌పై దస్తగిరికి ప్రశ్నల వర్షం
- వివేకా హత్య కేసులో ముగిసిన దస్తగిరి ఈడీ విచారణ
- దస్తగిరిని 7 గంటలపాటు ప్రశ్నించిన ఈడీ అధికారులు
- వివేకా హత్య కేసులో జరిగిన రూ.40 కోట్ల డీల్‌పై దస్తగిరిని ప్రశ్నించిన ఈడీ



**అమరావతి**

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారించింది. నేడు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లిన దస్తగిరిని అధికారులు 7 గంటలపాటు ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో జరిగిన 40 కోట్ల రూపాయల డీల్‌పై అధికారులు విచారించారు. ఎర్ర గంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, దస్తగిరి మధ్య జరిగిన ఒప్పందంపైనా ఆరా తీశారు. తనకు 5 కోట్ల రూపాయలు ఇస్తామని గతంలో సీబీఐకి దస్తగిరి వెల్లడించాడు. అప్పట్లో దస్తగిరి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఈడీ - మిగతా3లో



## యువత గొంతు నొక్కితే ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే

- బీజేపీపై రాహుల్‌గాంధీ ఫైర్
- బిహార్‌లో పరీక్షా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళన
- పోలీసుల చర్యల్లో పలువురు విద్యార్థులు గాయపడ్డారని రాహుల్‌గాంధీ వ్యాఖ్య
- యువత గొంతును అణచివేసే ప్రభుత్వాలు ప్రజలకు సమాధానం చెప్పక తప్పదని హెచ్చరిక

## అమరావతి సంగమం నిర్మాణానికి
# 759.79 కోట్లు



- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలివే
- 31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- రైతులకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపాదనలు
- అమరావతిలో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనపైనా చర్చ
- స్టేట్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గుడ్ గవర్నెన్స్ సంస్థలతో 'అమరావతి సంగమం' నిర్మాణం
- కాలువల నిర్వహణ, సాగునీటి హక్కులపై చర్చ

**అమరావతి**

31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ మీటింగ్‌లో రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులు, మత్స్యకారులు, అమరావతి, సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అలాగే రైతులకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపాదనలు జరిగాయి. తోతాపురి మామిడికి మద్దతు ధర కోసం - మిగతా3లో



## క్లీన్ ఎనర్జీ, కీలక ఖనిజాలపై దృష్టి

- ఘర్షణలకు చర్చలు, దౌత్యమే మార్గం'
- భారత ఆర్థిక వృద్ధి వల్ల ప్రపంచానికి కొత్త అవకాశాలు
- ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలన్న ప్రధాని మోదీ.. బెల్జియం మధ్య కీలక ఒప్పందాలు

## అక్టోబరు నుంచి
# కొత్త పింఛన్లు

- ప్రతి ఒక్కరికీ దశల వారీగా కొత్త పింఛన్లు మంజూరు
- తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్
- కేబినెట్ భేటీకి ముందు మంత్రులతో సమావేశమైన లోకేశ్.. పలు అంశాలపై దిశానిర్దేశం
- స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధమై.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపు
- మొదట పురపాలక ఆతర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, అనంతరం పంచాయతీ ఎన్నికలు



**అమరావతి**

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ దశల వారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్టు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. అర్హులకు కొత్త పింఛన్లు అందించాలని మంత్రులకు సూచించారు. కేబినెట్ భేటీకి ముందు మంత్రులతో సమావేశమైన లోకేశ్.. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధమై.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అక్టోబరులోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని, ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా త్వరగా పరిష్కరించి.. అన్ని స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేలా - మిగతా3లో

## వన్య ప్రాణుల మరణాలపై
# సమగ్ర అధ్యయనం

- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణను మరింత బలోపేతం చేసే దిశగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలి
- వన్యప్రాణుల ఆవాసాల నిర్వహణ, రక్షణ చర్యలు, మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంరక్షణ కార్యక్రమాల ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలి



**అమరావతి**

వన్య ప్రాణుల మరణాలపై సమగ్ర అధ్యయనం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణను మరింత బలోపేతం చేసే దిశగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఇటీవల చోటు చేసుకున్న వన్యప్రాణుల మరణాల ఘటనలపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. పులుల మరణాలపై అధ్యయనానికి అటవీశాఖ సలహాదారు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి నేతత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి ఆ బాధ్యతలను అప్పగించారు. వన్యప్రాణుల ఆవాసాల నిర్వహణ, రక్షణ చర్యలు, మానవ--వన్యప్రాణి ఘర్షణల నివారణ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంరక్షణ కార్యక్రమాల ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన చర్యలు అమలు అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత హనుమాన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రత్యేక బందాలను రంగంలోకి దించి, ప్రత్యేక పరిస్థితుల్లోనూ జంతువుల సంరక్షణ చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం అమలు లో ఉన్న కార్యక్రమాలు, వాటి ఫలితాలను - మిగతా3లో




## అమెరికాతో ట్రేడ్ డీల్‌పై
# భారత్ కీలక షరతు

- మన వస్తువులకు తక్కువ టారిఫ్‌లను ప్రతిపాదిస్తేనే!
- పోటీ దేశాల కంటే భారత్‌కు మెరుగైన టారిఫ్ రేట్లు ఇవ్వాలని అమెరికాకు స్పష్టం
- అనుకూల నిబంధనలు ఖరారైన వెంటనే బీటీఏ తుది వివరాలు ప్రకటిస్తామని పీయూశ్ గోయల్ వెల్లడి

## రాహుల్‌పై ఎన్ని ఎఫ్ఐఆర్ పెట్టినా భయపడేది లేదు



- హల్ద్వానీ ర్యాలీ ప్రాంగణంలో శుద్ధీకరణపై వివాదం
- దళితుల కోసం గొంతెత్తిన రాహుల్‌ను భయపట్టేందుకే ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్న మల్లికార్జున ఖర్గే
- ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటామంటూ కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలు
- హల్ద్వానీ ఘటనను కేవలం శుద్ధీకరణగా చూడలేం
- "రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత. పార్లమెంట్‌లోనే కాకుండా బయట కూడా ప్రజా సమస్యలపై గొంతెత్తుతున్నారు
- విద్యార్థులు, మహిళలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, దళితుల సమస్యలపై ప్రశ్నిస్తున్నారు.

# బంధం... బలపడుతోంది

**విజయవాడ :** ఏపీలో రాజకీయాలు విచిత్రంగా ఉంటాయి. మూడు పార్టీల కూటమి ఒక వైపు.. మరోవైపు విపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంది. ఆ మూడు పార్టీల మధ్య బంధం స్ట్రాంగ్ గా ఉంది. అలా ఉన్నంతవరకు ఆ కూటమిని వైసిపి ఏం చేయలేదు అనేది మెజారిటీ విశ్లేషకుల భావన. అయితే ఐక్యం అనేది ఆ మూడు పార్టీల ఇష్టం. వైసిపి గెలవాలి అనుకున్నవారు కూటమి విచ్ఛిన్నం కావాలని కోరుకుంటారు. మెజారిటీ వైసీపీ శ్రేణులు కోరుకునేది అదే. అందుకే ఆ మూడు పార్టీల మధ్య విఘాతానికి చేయని ప్రయత్నం అంటూ లేదు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, లోకేష్ల మధ్య గట్టి తగాదా రావాలని బలంగా కోరుకుంటున్నారు. కానీ రోజు రోజుకి వారి మధ్య బంధం పెరుగుతూనే ఉంది కానీ.. తగ్గడం లేదు. పవన్ కళ్యాణ్ విషయంలో నారా లోకేష్ చేసిన ప్రకటన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతోంది.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు ఈరోజు. తెలుగు రాష్ట్రాల్లో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. కూటమి పార్టీల శ్రేణులు పాల్గొంటున్నాయి. దేశవ్యాప్తంగా ప్రముఖులు పవన్ కళ్యాణ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. అయితే అందరికంటే నారా లోకేష్ శుభాకాంక్షలు ప్రత్యేకంగా నిలిచాయి. సినీ అభిమానుల దృష్టిలో పవర్ స్టార్.. జనసైనికుల దృష్టిలో సేనాని.. నాకు మాత్రం దేవుడు ఇచ్చిన అన్న పవన్ అంటూ సంబోధించారు నారా లోకేష్. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. ఆ పార్టీ మీడియాతో పాటు సోషల్ మీడియా ఏవేవో వ్యాఖ్యానాలు చేస్తున్నాయి.పవన్ కళ్యాణ్ విషయంలో లోకేష్ మాత్రం చాలా ప్రత్యేకంగా చూస్తుంటారు. పవన్ కళ్యాణ్ జనసేన అధినేత. లోకేష్ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్. కానీ వారిద్దరి మధ్య బంధం బాగానే ఉంటుంది. అది ఎంత మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రుచించదు. అందుకే లోకేష్ పవన్ విషయంలో స్పందించిన ప్రతిసారి వైసీపీకి ఎక్కడలేని కోపం. వారు భాగస్వామ్య పార్టీల అధినేతలు. ఆ పైవారు పరస్పరం గౌరవించుకుంటున్నారు కానీ ఈ విషయంలో ఎందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అతిగా రియాక్ట్ అవుతుందో తెలియడం లేదు. ప్రస్తుతం వైసీపీ అనుకూల మీడియాతో పాటు సోషల్ మీడియాలో.. పవన్ కళ్యాణ్ ను ఆకాశానికి ఎత్తేస్తున్న లోకేష్ అంటూ శీర్షికలు పెట్టి కథనాలు రాస్తున్నారు. వాళ్లు స్నేహితులు. వారు చేసుకోకపోతే ఎవరు చేస్తారు? అసలు ఈ విషయంలో వైసీపీకి ఎందుకు అంత ఉత్సాహం? అంటే వారు కలిసి ఉంటే తనకు సుఖం ఉండదు. తనకు విజయం దక్కాలంటే వారు కలిసి ఉండకూడదు. కానీ వారి మధ్య బంధం రోజురోజుకు పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు.




జెన్ జీ జపంలో జనసేనాని

ఏపీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పవన్ పుట్టినరోజు సందర్భంగా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది జనసేన. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ యువజన విభాగం పేరును 'జై కొట్టు' గా నామకరణం చేసింది. జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఈ నూతన విభాగం 'జై కొట్టు'ను ఆవిష్కరించారు. జై కొట్టు పేరుతో ప్రత్యేకంగా ఒక పాటను కూడా విడుదల చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాను ఈ పాట షేక్ చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అంబరాన్ని తాకాయి.పవన్ కళ్యాణ్ గత కొద్దిరోజులుగా కేరళలో ఉంటున్న సంగతి తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అక్కడ ప్రకృతి వైద్యశాలలో వైద్య సేవలు పొందుతున్నారు. అందుకే తన జన్మదిన వేడుకలకు హాజరు కాలేకపోయారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా పవన్ జన్మదిన వేడుకలు అంబరాన్ని తాకుతున్నాయి. ఎక్కడికక్కడే బైక్ ర్యాలీలు చేపడుతున్నారు.. ఆలయాల్లో పూజలతో పాటు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జనసేనకు ముఖ్యంగా యువత బలం అధికం. అందుకే ఆ పార్టీ యువజన విభాగానికి ప్రత్యేక నామకరణం చేయాలని భావించారు. అందుకు పవన్ పుట్టినరోజు వేడుకలను వేదికగా చేసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ జన్మదిన వేడుకల్లో పార్టీ యువజన విభాగానికి జై కొట్టు అనే ప్రత్యేక పేరును పెట్టారు.మరోవైపు ఈ జై కొట్టు అనే నినాదానికి.. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ పాత తోడైంది.' జై కొట్టు' పేరుతో ప్రత్యేకంగా పాటను కూడా విడుదల చేశారు. ఈ పాటకు థమన్ మ్యూజిక్ అందించారు.. అయితే ఇంత పెద్ద కార్యక్రమానికి పవన్ కళ్యాణ్ హాజరు కాలేకపోయారు. అందుకే ఆయన ఆడియో మెసేజ్ పంపించారు. చెయ్యెత్తి జై కొట్టు నినాదం అందర్నీ ఆకట్టుకుంటుందని మనోహర్ అభిప్రాయపడ్డారు. ఆ స్ఫూర్తిని అందించాలనే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ లోగోను తీసుకొచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. జై కొట్టు నినాదంతో యువత ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలన్న ఉద్దేశంతోనే ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అరుపులు, కేకలు మాత్రమే కాదు. క్రమశిక్షణ కూడా ఎంతో ముఖ్యమని చెప్పారు జై కొట్టు నినాదంతో యువత ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలన్న ఉద్దేశంతోనే ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అరుపులు, కేకలు మాత్రమే కాదు. క్రమశిక్షణ కూడా ఎంతో ముఖ్యమని చెప్పారు

# ఆలయాలకు మహర్ధశ...

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 5 వేల దేవాలయాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీ, దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు.రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల దేవాలయాల నిర్మాణంపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఆలయాల నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలాలు త్వరలోనే ఖరాలు చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. ఆధ్యాత్మికత ను మరింత ప్రోత్సహించేలా కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. ఆలయాల నిర్మాణం, ఆధ్వర్యంలో ధార్మిక, విద్య, వైద్య సేవలపై క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు.ఆంధ్రప్రదేశ్ లో 28 జిల్లాల్లో 161 నియోజకవర్గాల నుంచి 4,192 ఆలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందాయని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర సీఎంకు వివరించారు. 967 ఆలయాల నిర్మాణం పూర్తయిందని 3 కేటగిరీలుగా నిర్మించేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, మత్స్యకార ప్రాంతాలు, బలహీన వర్గాల కాలనీలతో పాటు సాధారణ ప్రాంతాల్లోనూ ఆలయాలు నిర్మిస్తున్నట్టు వెల్లడించారు.శ్రీవాణి ట్రస్టు ద్వారా వచ్చే నిధులను కూడా ఆలయాల నిర్మాణానికి వినియోగించాలని, శ్రీవారి సేవకుల సేవలు వినియోగించుకోవాలని, భక్తుల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. సభ్యులు, భక్తులు, శ్రీవారి సేవకులతో ఎగ్జిక్యూటివ్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లోనూ శ్రీవారి ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలన్నారు. మారిషన్ వంటి దేశాలు స్వామివారి ఆలయాలు నిర్మించాలని కోరుకుంటున్నాయి..భవిష్యత్ లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా మారేలా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారుకొత్త నిర్మించే ఆలయాల్లో విగ్రహాల ఏర్పాటు, అర్చకుల శిక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 1000 పాత ఆలయాలను పునరుద్ధరించాలని, శివాలయాలు, శక్తి పీఠాల అభివృద్ధిపైనా దృష్టి పెట్టాలన్నారు. అన్ని ఆలయాలకు సంబంధించిన వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు.దేవాదాయశాఖ పరిధిలో ఉన్న 28 వేల ఆలయాలు, నిర్వహిస్తున్న 65 ఆలయాలతో పాటు కొత్తగా నిర్మించే 5 వేల ఆలయాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక అవసరం అన్నారు.నిర్వహిస్తున్న అన్నదానం, శ్రీవారి సేవకుల సేవలు, ఆలయాల నిర్మాణం వంటి కార్యక్రమాలను హిందూ ధర్మ ప్రచారంతో అనుసంధానిస్తూ మరింత విస్తృతం చేయాలన్నారు ఎన్టీఆర్ ప్రారంభించిన అన్నదానం కార్యక్రమం గొప్ప సేవా కార్యక్రమంగా మారిందని చెప్పారు. ప్రాణదానం ట్రస్టు ను టీటీడీ వైద్య సేవలకు బెస్ట్ మోడల్ గా తయారు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. నిపుణులైన వైద్యుల సేవల్ని కూడా వినియోగించుకోవాలన్నారు.ఉన్న అన్ని ఆస్పత్రుల సేవల్ని అనుసంధానించాలని.. కేన్సర్ , కంటి వైద్యం సహా తిరుపతిలోని ఆయుర్వేద వైద్య సేవల్ని కూడా విస్తృతం చేయాలన్నారు. వైద్యులను శ్రీవారి సేవకులుగా మార్చి వైద్య సేవలతో పాటు బోధన కార్యక్రమాల్లోని సేవల్ని వినియోగించుకోవాలన్నారు. పరిధిలోని 33 విద్యా సంస్థల వ్యవస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు సూచించారు. విద్య, వైద్యం, సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతిలోని శ్రీవారి ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు చంద్రబాబు.తిరుమలతో పాటు తిరుపతిని కూడా సంపూర్ణ దివ్య క్షేత్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఆధ్యాత్మికత, పవిత్రత ప్రతిబింబించేలా ప్రత్యేక ఎకోసిస్టమ్ రూపొందించాలని ,నిపుణులైన భక్తుల భాగస్వామ్యంతో సేవలు మరింత విస్తృతంగా ప్రజలకు చేరేలా చూడాలన్నారు.తీర్చిదిద్దాలన్నారు. ఆధ్యాత్మికత, పవిత్రత ప్రతిబింబించేలా ప్రత్యేక ఎకోసిస్టమ్ రూపొందించాలని ,నిపుణులైన భక్తుల భాగస్వామ్యంతో సేవలు మరింత



## వివేకా హత్య కేసులో ఈడీ దూకుడు

-మొదటిపేజీ తరువాయి

అధికారులు దర్యాప్తు చేశారు. వివేకానందరెడ్డి హత్యకు ముందు, తర్వాత బ్యాంక్ లావాదేవీలపైనా ఈడీ దృష్టి సారించింది. దస్తగిరి కూడా బ్యాంక్ స్టేట్మెంట్లతో ఈడీ విచారణకు హాజరయ్యాడు.

**తెర వెనుక ఉన్న వ్యక్తులెవరు?**

మరోవైపు వివేకా హత్య కోసం కీలక కుట్రదారులు వెచ్చించాలని నిర్ణయించుకున్న రూ.40 కోట్లు వారు ఎక్కడి నుంచి సమకూర్చుకోవాలనుకున్నారు? అంత భారీ మొత్తం వారికి ఇచ్చేందుకు తెర వెనుక సిద్ధమైన వ్యక్తులెవరు? హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న నలుగురు నిందితులకు అడ్వాన్స్గా చెల్లించిన రూ.4 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయనే కోణాల్లో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది.

కేసులో కీలక కుట్రదారులు, నిందితులు, అనుమానితులు, తెరవెనక సూత్రధారులు వివేకా హత్యకు కొన్ని నెలల ముందు, తర్వాత నిర్వహించిన ఆర్థిక లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తోంది. ఈ డబ్బు ఎవరి నుంచి ఎవరికి, ఏయే మార్గాల్లో రూటింగ్ అయ్యింది, దీనికి మూలం ఎక్కడుందనే కోణంలో వివరాలు సేకరిస్తోంది. ఈ క్రమంలోనే నిందితులైన అవినాష్రెడ్డి, దేవిరెడ్డి శివశంకరరెడ్డి, సునీల్యాదవ్, ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరిల నివాసాల్లో సోదాలు చేసి ఇప్పటికే కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకుంది.

**హత్య వెనక రాజకీయ నాయకులు**

వైఎస్ వివేకానందరెడ్డి 2019 మార్చి 15 అర్ధరాత్రి తర్వాత పులివెందులలోని ఆయన నివాసంలో దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యకు ఫిబ్రవరి 10న ఎర్ర గంగిరెడ్డి నివాసంలోనే కుట్ర రూపొందించినట్లు సీబీఐ దర్యాప్తులో తేల్చింది. 'వివేకానందరెడ్డిని చంపేయ్ ఈ హత్య చేస్తే నీ జీవితం సెటిలైపోతుంది. నువ్వు ఒక్కడివే కాదు. మేమూ నీతో వస్తాం' అని ఎర్రగంగిరెడ్డి తనతో చెప్పారని కేసులో అప్రూవర్గా మారిన షేక్ దస్తగిరి ఇప్పటికే సీబీఐకి వాంగ్మూలం ఇచ్చాడు.

హత్య వెనక వైఎస్ భాస్కరరెడ్డి, వైఎస్ అవినాష్రెడ్డి, దేవిరెడ్డి శివశంకరరెడ్డి వంటి పెద్ద రాజకీయ నాయకులున్నారని, హత్య చేస్తే శివశంకరరెడ్డి రూ.40 కోట్లు ఇస్తారని, అందులో రూ.5 కోట్లు నీకు ఇస్తానని కూడా ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పారని దస్తగిరి వాంగ్మూలంలో చెప్పాడు. వివేకానందరెడ్డిని చంపాలని ఎర్ర గంగిరెడ్డి చెప్పిన రెండు, మూడు రోజుల తర్వాత సునీల్ యాదవ్ కోటి నగదు తీసుకెళ్లి దస్తగిరికి అడ్వాన్స్గా ఇచ్చాడని సీబీఐ అభియోగపత్రంలో పేర్కొంది.

## అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759.79 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

మార్క్ఫెడ్కు రూ.281 కోట్ల నిధులు సమకూర్చుకునే ప్రతిపాదన, పొగాకు రైతులకు ఐదీ ద్వారా రూ.94 కోట్ల ఆర్థిక సాయం అంశాలు కేబినెట్ ముందుకు వచ్చాయి. మత్స్యరంగాన్ని ప్రోత్సహించేలా రిజర్వాయర్ కేజ్ కల్చర్ పాలసీ–2026 ముసాయిదాకు ఆమోదం తెలిపింది. మంత్రివర్గ భేటీలో చర్చించిన విషయాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

'అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.759 కోట్ల 79 లక్షల పరిపాలనా అనుమతి ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అమరావతిలో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనపైనా చర్చ జరిగింది. అమరావతి రైల్వే కనెక్టివిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు పనులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శాఖమూరులో స్టేట్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గుడ్ గవర్నెన్స్ సంస్థలతో 'అమరావతి సంగమం' నిర్మాణం చేపట్టనున్నారు. సాగునీరు, వరద పునరుద్ధరణకు సంబంధించి కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 78 పనులకు రూ.6 కోట్ల24 లక్షలకు పైగా పరిపాలనా ఆమోదం, వ్యయానికి అనుమతిపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

**కాలువల నిర్వహణ, సాగునీటి హక్కులపై చర్చ**

వెలిగొండ టన్నెల్–2లో ఎదీవీ తొలగింపు పనులకు రూ.11కోట్ల 63 లక్షల మంజూరుపైనా ఆమోదం తెలిపింది. కాలువల నిర్వహణ, సాగునీటి హక్కులకు సంబంధించిన అంశాలపైనా చర్చ జరిగింది. విద్యుత్ రంగంలో ఏపీ ట్రాన్స్కో మధ్యకాలిక రుణానికి రూ.950 కోట్ల ప్రభుత్వ గ్యారంటీ, సీలేరు కాంప్లెక్స్లో ఏపీ జెన్కోకు ఫైర్ ప్రికాషనరీ ఫీజు మినహాయింపు ప్రతిపాదనలు కేబినెట్ పరిశీలనకు వచ్చాయి.

**కడప జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు**

ఓక్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులో 800 మెగావాట్ల కేటాయింపు రద్దు, విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టులో సామర్థ్యాల మార్పిడిపైనా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఘ్రాణజూ రుణాలకు సంబంధించి జెన్కోకు కార్పొరేట్ గ్యారంటీలు ఇచ్చేందుకు అనుమతిపైనా చర్చించింది. పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి, వివిధ ప్రభుత్వ సంస్థలకు భూ కేటాయింపులు, మార్కాపురంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం, కడప జిల్లాలో ౹ావీ–కుసుమ్ కింద సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలపైనా మంత్రివర్గం చర్చించి నిర్ణయాలు తీసుకుంది.

## వన్య ప్రాణుల మరణాలపై సమగ్ర అధ్యయనం


-మొదటిపేజీ తరువాయి

శాస్త్రీయంగా విశ్లేషించి, అవసరం ఉన్న చోట మరింత పకడ్బందీగా చర్యలు అమలు చేయాలన్న ఉద్దేశంతో పవన్ కళ్యాణ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర అటవీశాఖ సలహాదారు మల్లిఖార్జునరావు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి రాహుల్ పాండే నేతత్వంలోని ప్రత్యేక కమిటీ రాష్ట్రవ్యాప్తంగా వన్యప్రాణుల సంచారం ఉన్న ప్రాంతాలను సందర్శించి, వాటి మరణాలకు దారితీస్తున్న అంశాలు, ఆవాసాల్లో పరిస్థితులు, సంచార మార్గాల్లో అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు, వేట నిరోధక చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థలు, అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణ, నీటి వనరుల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. దీంతో పాటు పులులు, చిరుతలు, ఏనుగులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు అమలవుతున్న కార్యక్రమాలను సమీక్షించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను గుర్తించి, నివారణ చర్యలపై సూచనలు చేయనుంది. వన్యప్రాణుల ఆవాసాల అభివద్ధి, సహజ ఆహార వనరుల పెంపు, సంచార మార్గాల సంరక్షణ, స్థానిక ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రత్యేక నివేదిక రూపొందించి పవన్ కళ్యాణ్కి అందజేస్తుంది.

## అక్టోబరు నుంచి కొత్త పింఛన్లు

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మొదట పురపాలక ఆతర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, అనంతరం పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడితే ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయి.. రాష్ట్రానికి నష్టం జరుగుతుందనే దురుద్దేశంతో ప్రతిపక్షం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మాట వినని అధికారులు, శాఖకు లేదా మంత్రికి చెడ్డపేరు తెచ్చేలా



వ్యవహరించే అధికారుల విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుందామని తెలిపారు. ఇటీవల కొన్ని సమస్యలు ఒకరిద్దరు అధికారుల పనితీరుతోనే ఉత్పన్నమయ్యాయని అభిప్రాయపడ్డారు. వైద్య రంగంలో చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియాలో.. ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ జరుగుతోందని, ఇలాంటి అంశాలపై కూడా మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. (సెప్టెంబరు 9న) అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి, అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని లోకేశ్ సూచించారు. నాటి దుశ్చర్య నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తీరును ప్రజలకు గుర్తు చేసేలా కార్యక్రమం ఉండాలన్నారు. ఎల్నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున.. ముందస్తు ప్రణాళికలు, పొదుపు చర్యలతో సమస్యను అధిగమిద్దామని లోకేశ్ సూచించారు. తీరును ప్రజలకు గుర్తు చేసేలా కార్యక్రమం ఉండాలన్నారు. ఎల్నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున.. ముందస్తు ప్రణాళికలు, పొదుపు చర్యలతో సమస్యను అధిగమిద్దామని లోకేశ్ సూచించారు.

# డీఎస్సీ లో ఉద్యోగాలు పొందిన వారిపై విచారణ జరపాలి

## -ఆల్ ఇండియా స్టూడెంట్స్ పవర్ అధ్యక్షుడు దినేష్ కుమార్



పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 3

ఏపీ డీఎస్సీలో అక్రమాలు జరిగాయి అంటూ ఆందోళనలు వెలువెత్తుతున్న వేల, కడప జిల్లాలో కూడా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందిన వారిపై విచారణ చేపట్టాలని కడప జిల్లా ఆల్ ఇండియా స్టూడెంట్స్ పవర్ అధ్యక్షుడు దినేష్ కుమార్ డిమాండ్ చేయడం జరిగింది. వివరాల్లోకి వెళ్తే కర్నూలు జిల్లాలో టెట్ పాస్ అవ్వకుండానే డీఎస్సీలో ప్రభాకర్ ఎస్జిటి టీచర్ ఉద్యోగం పొందాడు. ఈయన ప్రస్తుతం కౌతాళం మండలం వల్లూరు ఎలిమెంటరీ స్కూల్లో విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ పొందాడు. ఆయనపై ఫిర్యాదులు రావడంతో కౌతాళం డీఈవో సుధాకర్ విచారణ చేపట్టారు. వెంటనే అధికారులు ప్రభాకరపై చర్యలకు సిఫారస్ చేయగా, ఈ విచారణలో భాగంగా ప్రభాకర్ ఎస్జిటి టెట్లో క్వాలిఫై కాకుండానే ఉద్యోగం పొందాడు ఇక్కడ విచిత్రం ఏమంటే సర్టిఫికెట్ వెరిఫికేషన్ లో అధికారులు ప్రభాకర్ టెట్ క్వాలిఫై అయ్యాడా లేదా అని గుర్తించకుండా ఉద్యోగం ఇచ్చారు. వాస్తవానికి ప్రభాకర్ స్కూల్ అసిస్టెంట్ టెట్టు క్వాలిఫై అయ్యాడు కానీ ఎస్జిటి టెట్ క్వాలిఫై కాలేదు, కానీ ఆ విషయం గమనించకుండా అధికారులు స్పోర్ట్స్ కోటాలో ప్రభాకర్కు ఎస్జీటీ ఉద్యోగం ఇవ్వడం పల అనుమానాలకు దారితీస్తుంది, ప్రభాకర్ ఒక్కడే కాదు ఇంకా కొంతమంది ఇలాగే ఉద్యోగం పొందినట్టు ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకపక్క కూటమి ప్రభుత్వమేమో మేము డీఎస్సీని పారదర్శకంగా జరిపామని అర్హులకే ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటూ, నిరుద్యోగాల జీవితాలతో ఆడుకుంటున్న ఈ కూటమి ప్రభుత్వానికి ఎక్కడి న్యాయం అని ఆయన ధ్వజమెత్తారు. అలాగే కడప జిల్లాలో కూడా ఇలాగా ఫేక్ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగం పొందారని అనుమానం వ్యక్తం అవుతున్న తరుణంలో కడప డిఇఓ స్పోర్ట్స్ కోటలో ఉద్యోగం పొందిన వారిపై విచారణ చేయాలని దినేష్ కుమార్ డిమాండ్ చేయడం జరిగింది. రాబోయే జాబ్ క్యాలెండర్ లో ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పరీక్షలు జరిపి అర్హులకు ఉద్యోగాలు ఇవ్వాలని అలా కాకుండా అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వస్తే భారీ ఎత్తున విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా స్టూడెంట్స్ పవర్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు అలవాటు వల్ల ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు -- సీఐ పురుషోత్తం రాజు

## మరణం తరువాత కూడా ఈ ప్రపంచాన్ని చూడాలంటే నేత్రదానం ఒక్కటే మార్గం --





ఆర్ ఉ బి డీఈఈ జగదీశ్వర్ రెడ్డి

పులివెందుల, కదిలించే వార్త సెప్టెంబర్ 3:యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ ఉజ్వల భవిష్యత్‌ను కాపాడుకోవాలని పులివెందుల సీఐ పురుషోత్తం రాజు సూచించారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా గురువారం పులివెందుల పట్టణంలోని సాయి చైతన్య జూనియర్ కళాశాల మరియు చైతన్య డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ నారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి ల అధ్యక్షత డాక్టర్ అగర్వాల్ నేత్రనిధి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలన మరియు నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ పురుషోత్తం రాజు మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వ్యసనం యువత జీవితాలను నాశనం చేస్తోందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రమశిక్షణ మరియు మంచి విలువలతో ముందుకు సాగాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. యువత తమ లక్ష్యాలను సాధించేందుకు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్ ఉ బి డీఈఈ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, మరణం తర్వాత కూడా ఈ అందమైన ప్రపంచాన్ని చూడాలంటే నేత్రదానం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఒక వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంపొందించుకొని కుటుంబ సభ్యులతో కలిసి నేత్రదాన సంకల్పం చేయాలని కోరారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ 2022లో పులివెందులలో ప్రారంభమైన నేత్ర సేకరణ కేంద్రం ద్వారా ఇప్పటికే అనేక మంది దాతల నేత్రాలను సేకరించి అవసరమైన వారికి చూపు ప్రసాదించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా విద్యార్థులు, యువతలో నేత్రదానం పట్ల చైతన్యం కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, నేత్రదానం యొక్క ప్రాముఖ్యత, నేత్రదానం నమోదు విధానం తదితర అంశాలపై వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లు మునీశ్వరయ్య, నరేష్ కుమార్, అధ్యాపకులు, సేవాసమితి సభ్యులు చాంద్ బాషా,రాఘవేంద్ర రెడ్డి,నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

# కణంపల్లి గ్రామంలో నాకాబందీ -- సమస్యాత్మక వ్యక్తులకు కౌన్సెలింగ్



లింగాల కదిలించే వార్త సెప్టెంబర్ 3

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు పులివెందుల డి.ఎస్పీ బి.మురళి పర్యవేక్షణలో పులివెందుల అర్బన్ సి.ఐ పురుషోత్తం రాజు, ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం పులివెందుల అర్బన్ పరిధిలోని కణంపల్లి గ్రామంలో నాకాబందీ కార్యక్రమం నిర్వహించారు. నాకాబందీ లో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో రికార్డులు లేని రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా సమస్యాత్మక వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు గట్టిగా హెచ్చరించారు.నిర్మాణంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే పనులు అడ్డుకున్నా, నిర్మాణ సామాగ్రి దొంగిలించినా వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోబడతాయని పోలీస్ అధికారులు హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాలు, దొంగతనాలు, అక్రమ సారా, రోడ్డు ప్రమాదాలు, క్రికెట్ బెట్టింగ్, గంజాయి మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నేరాలకు దూరంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో పులివెందుల సబ్ డివిజన్ లోని పులివెందుల రూరల్ సీఐ శాంతి లాల్, వేంపల్లి సిఐ నరసింహులు, ఆర్కే వల్లి సిఐ శంకర్ రెడ్డి, ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో భాగవత సప్తహ శ్రవణ యజ్ఞ పఠనం



తొండూరు కదిలించే వార్త సెప్టెంబర్ 3

తొండూరు మండలం

గ్రామ పరిధి లోని పాటి మీద శ్రీ

లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం లో గురువారం మొదటి రోజు విజయ వంతంగా

ప్రారంభ మైన భాగవత సప్తహ శ్రవణ యజ్ఞ పఠనం పులివెందుల భాగవత భక్త సమాజం నిర్వ హన లో. ఈనెల 9 వరకు సప్తహ పఠనం జరగ

నున్నదన్నారు. బూచుపల్లి

గంగిరెడ్డి జయలక్షుమ్మ

నరసింహారెడ్డి బాలనారాయణ

రెడ్డి లక్ష్మీ ప్రసన్న అల్లుడు సుదర్శన్ రెడ్డి కుమెర్తి మహేశ్వరి

కుటుంబ సభ్యుల ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వ హిస్తున్నారు. బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్న దాత

గంగిరెడ్డి కుటుంబ సభ్యులనుపండితులఅభినందిస్తున్నారు.ఏడు రోజులపాటు జరగనున్న

భాగవత సప్తహ పఠనంలో

భాగవత పండి తులు పాల్గొని

శ్రీ కృష్ణ పరమాత్మ నీ కృపకుపాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

# ఉపాధి హామీ పథకం ద్వారా పొలాలకు రోడ్లు వేయించాలి

## రైతుల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి: బీజేపీ కిసాన్ మోర్చా

వేంపల్లె సెప్టెంబర్ 3 (కదిలించే వార్త): ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ పొలాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్ కోరారు. వేంపల్లి మండలం బక్కన్నగారిపల్లెలో వ్యవసాయ పొలాలకు వెళ్లే దారులను బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. రామచంద్రారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్తో కలిసి ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా పుష్పలత నాయక్ మాట్లాడుతూ.. గిరిజన తాండా రైతులు సాగు చేస్తున్న పొలాలకు సరైన రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంటలను మార్కెట్‌కు తరలించేందుకు రవాణా మార్గం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, వర్షం పడితే పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటోందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పథకం ద్వారా తక్షణమే వ్యవసాయ పొలాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవి యాదవ్తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.




# శిరిడి సాయిబాబాకి విశేష పూజలు ప్రత్యేక అలంకరణలో సాయినాధుడు



పులివెందుల అర్బన్ కదిలించే వార్త సెప్టెంబర్ 3పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శ్రావణమాస సందర్భంగా ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయినాధునికి ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు . మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామివారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు

# వార్డుల వారిగా ఓటర్ల జాబితా ప్రకటన పులివెందుల మున్సిపల్ కమిషనర్ తనూజ



పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 3

మున్సిపల్ సాధారణ ఎన్నికలు పురస్కరించుకుని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 40 వార్డుల ఓటరు జాబితాను ప్రకటించడం జరిగిందని పులివెందుల మున్సిపల్ కమిషనర్ తనూజ పేర్కొన్నారు. గురువారం పత్రికలకు అందించినటువంటి సమాచారం మేరకు పులివెందుల పురపాలక సంఘ పరిధిలోని 40 వార్డులకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫోటోతో కూడిన ఓటరు జాబితాను పులివెందుల తహసిల్దారు పులివెందుల పురపాలక సంఘం మరియు పులివెందుల రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం నందు ప్రకటించడమైనదని కావున పులివెందుల పురప్రజలు తమ జాబితాను సరిచూసుకోగలరని విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణ రహిత వస్తువుల వినియోగానికి ప్రాధాన్యత నివ్వండి

## ఆర్డీవో చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ తనూజ





పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 3

వినాయక చవితి మరియు దుర్గాష్టమి పండుగ విగ్రహాలను సహజ పదార్థాలతో తయారుచేసిన పర్యావరణ రహిత విగ్రహాలను మాత్రమే వినియోగించాలని పులివెందుల రెవెన్యూ డివిజన్ అధికారి చిన్నయ్య మరియు పులివెందుల మున్సిపల్ కమిషనర్ తనూజ పేర్కొన్నారు. గురువారం రెవెన్యూ డివిజన్ కార్యాలయ, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మరియు ఇతర మహిళా పొదుపు సంఘాల ఆర్పీలచే మట్టి విగ్రహాలను వినియోగించి పులివెందుల పట్టణ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలంటూ పూలంగుల సర్కిల్ నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వినాయక మండపాల పూజల యందు మరియు అన్నదాన కార్యక్రమాల యందు పర్యావరణ రహిత వస్తువులను వినియోగించేందుకు ప్రాముఖ్యతనివ్వాలని ప్లాస్టిక్ గ్లాసులు ప్లాస్టిక్ ప్లేట్లు ప్లాస్టిక్ పూలు తదితర సింగల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని అదేవిధంగా వ్యర్థాలను బహిరంగంగా పడేయరాదని ప్లాస్టిక్ మరియు ఇతర నాన్ బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను బహిరంగంగా పడేయరాదని, నిమజ్జనం సందర్భంగా ఏర్పడే అవశేషాలను మరియు ఇతర వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందికి అప్పజెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ మరియు మున్సిపల్ కమిషనర్ కార్యాలయ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# నేడు గోపాలుని గోకులాష్టమి వేడుకలు

## విశేష పూజలు, విభిన్న కార్యక్రమాల నిర్వహణ

## కార్యక్రమాల విజయవంతానికి పిలుపునిచ్చిన ఆలయ చైర్మన్ ధరణి రమణ




పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 3

పులివెందుల పట్టణ పరిధిలోని శ్రీకృష్ణ ఆలయం నందు గోపాలుని గోకులాష్టమి వేడుకలను పురస్కరించుకుని విశేష పూజలు విభిన్న కార్యక్రమాల నేపథ్యంలో కార్యక్రమాల విజయవంతానికి ప్రజలు తరలిరావాలని శ్రీకృష్ణ ఆలయం చైర్మన్ ధరణి రమణ పిలుపునిచ్చారు. పులివెందుల పట్టణం బాకరాపురం రింగ్ రోడ్డు ప్రాంతంలో వెలసినటువంటి శ్రీకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల నిర్వహణలో భాగంగా విశేష పూజా కార్యక్రమాలు అభిషేకాలు అర్చనలు, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు స్వామి వారి కళ్యాణం, అన్నప్రసాద వితరణ, వసంతోత్సవం, ఉట్టి కొట్టు కార్యక్రమం, కోలాటం, ప్రాకారోత్సవం మరియు అల్పాహార వితరణ వంటి కార్యక్రమములు నిర్వహించబడనని కావున భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందవలసిందిగా ఆలయ కమిటీ తరపున ఆలయ చైర్మన్ ధరణి రమణ ఆకాంక్షించారు.

# చైతన్య హైస్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి**

**చైర్మన్ బి. చక్రపాణి రెడ్డి**




వేంపల్లె సెప్టెంబరు 3 (కదిలించే వార్త):

వేంపల్లె చైతన్య హైస్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శ్రీకృష్ణుడి బాల్యలీలలు, భక్తి, ధర్మ సందేశాలను ప్రతిబింబించేలా విద్యార్థులు నృత్యాలు, నాటికలు, ప్రసంగాలతో అలరించారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం ప్రతి ఒక్కరికీ ధైర్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠ, సత్య మార్గంలో నడిచేందుకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు పండుగల విశిష్టతను తెలుసుకోవాలని, మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని, వారిలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ఐక్యత పెంపొందుతాయని చక్రపాణి రెడ్డి తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు, విద్యార్థుల నృత్యాలు, నాటికలు, ప్రసంగాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం శ్రీకృష్ణ నామస్మరణతో సందడిగా మారింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.






# పునర్నిర్మాణ పర్వంలో.. బ్రహ్మంగారి మనుమరాలి ఆలయం!

**రూ.3 కోట్లతో ఈశ్వరీదేవి నూతన మందిరం**

**బ్రహ్మంగారిమఠంలో ముమ్మరంగా పాత భవనం తొలగింపు**

**త్వరలోనే వైభవంగా శంకుస్థాపన**





బ్రహ్మంగారిమఠం కదిలించే వార్త సెప్టెంబరు 3 ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో జగన్మాత ఈశ్వరీ మహాదేవి నూతన ఆలయ పునర్నిర్మాణ మహత్కార్యం షురూ అయింది. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మనుమరాలైన ఈశ్వరీదేవి మందిరాన్ని సుమారు రూ.3 కోట్ల వ్యయంతో అత్యంత దివ్యంగా, భవ్యంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా గురువారం నుంచి పాత ఆలయాన్ని తొలగించే పనులను కాంట్రాక్టర్ వేగవంతం చేశారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసాలు, మనోభావాలకు అనుగుణంగా ఈ నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. పాత గుడి తొలగింపు పూర్తయిన వెంటనే వేద పండితుల సమక్షంలో నూతన ఆలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించి, పనులను త్వరలోనే పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

# దివ్యాంగులకు మాంసాహార పౌష్టికాహారం పంపిణీ.

**అణగారిన వర్గాలు, దివ్యాంగుల హక్కుల కోసం రాజీలేని పోరు కొనసాగిస్తాం.**

**ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ నేషనల్ డైరెక్టర్ షేక్ మహబూబ్ పీరాలి**





పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 3

అఖిలభారత మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఏడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగులకు కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంస్థ జాతీయ డైరెక్టర్ మహబూబ్ పీరా, ఏపీ కౌన్సిల్ చైర్మన్ మహమ్మద్ అక్రమ్, ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి సంస్థ ఫౌండేషన్ డే కేక్ ను కట్ చేసి, దివ్యాంగులకు అందించారు. అనంతరం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ భవనంలోని దివ్యాంగులకు, స్థానిక చిన్నన్న రూముల రోడ్డులోని భవిత స్కూల్ మానసిక వికలాంగులైన పిల్లలకు మాంసాహార పౌష్టికాహారమైన బిర్యాని పంపిణీ చేశారు. మానవ హక్కుల సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగులకు చేయూతనందించిన మహబూబ్ పీరా, ఇతర సభ్యులకు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు డా.ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీ. ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ వింగ్ చైర్మన్ షేక్ మహమ్మద్ అక్రమ్, రాష్ట్ర పబ్లిక్ రిలేషన్స్ విభాగం జాయింట్ సెక్రెటరీ మహమ్మద్ సుభాన్, కౌన్సిల్ కడప జిల్లా అధ్యక్షులు మహమ్మద్ నాసిర్, యాంటీ కరప్షన్ వింగ్ చైర్మన్ షాకీర్, పులివెందుల శాఖ అధ్యక్ష,కార్యదర్శులు భాష, రాజా, సంస్థ కార్యవర్గ సభ్యులు సతీష్,వంశి, సాహుల్, లోకేష్, హృతిక్, రాకేష్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

**ఒక్క పిలుపుతో 223 మంది పైన రక్తదానం చేయడం అభినందనీయము**

**మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి**

పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 3

దివంగత నేత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల నిర్వహించిన రక్తదాన శిబిరణాలలో రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మున్సిపల్ వైకాపా ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఇంకొకరి ప్రాణాలు కాపాడిన వారం అవుతామన్నారు. ఒక్క పిలుపుతో 223 మంది పైన రక్తదానం స్వచ్ఛందంగా చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్న అన్నారు.



## ఆర్జీయూకేటీ ఆర్‌కే వ్యాలీలో అధ్యాపకులకు అదనపు బాధ్యతలు

**వివిధ విభాగాలకు కోఆర్డినేటర్లుగా నియామకం**



వేంపల్లె సెప్టెంబరు 3 (కదిలించే వార్త):

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లో పలువురు అధ్యాపకులకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం. భాస్కరయ్యను పరిశోధన--అభివృద్ధి, ఉన్నత విద్య--పోటీ పరీక్షల విభాగాల కోఆర్డినేటర్‌గా, బయాలజీ అధ్యాపకుడు డాక్టర్ ఏ. జోబ్ రోజర్ బిన్నీని ఎస్టాబ్లిష్‌మెంట్ కోఆర్డినేటర్‌గా నియమించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి ఏ.వి. దుర్గా కిషోర్ రెడ్డికి అసోసియేట్ ఎస్టాబ్లిష్‌మెంట్ కోఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించారు. మ్యాథమెటిక్స్ అధ్యాపకురాలు డాక్టర్ జె. దీప్తిని చీఫ్ మెస్ కోఆర్డినేటర్‌గా, అసిస్టెంట్ లైబ్రేరియన్ డాక్టర్ డి. కోనప్పను ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కోఆర్డినేటర్‌గా నియమించారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు పి. ఉదయ్‌శ్రీకి పూర్వ విద్యార్థుల వ్యవహారాలు, విస్తరణ కార్యక్రమాల కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించారు. మేనేజ్‌మెంట్ అధ్యాపకుడు డాక్టర్ కే. కళ్యాణ్ చక్రవర్తిని సమాచార హక్కు చట్ట విభాగం కోఆర్డినేటర్‌గా, ఐటీ విభాగం మెంటార్ ఎస్. రామకృష్ణను డైరెక్టర్ పర్సనల్ అసిస్టెంట్‌గా నియమించారు. మహబూబ్ భాషాకు ప్రజా సంబంధాలు, ప్రచారం, మీడియా సమాచార మార్పిడిని సమన్వయం చేసే బాధ్యతలు అప్పగించారు. సదరు అధ్యాపకులు తమ సాధారణ బోధనా విధులను కొనసాగిస్తూనే అదనంగా అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. కొత్త బాధ్యతలు స్వీకరించిన అధ్యాపకులను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## పాఠశాల సమీపంలో పందుల పెంపకం తొలగించాలి

**గ్రామసభలో పోతిరెడ్డి చలపతి వినతి.. తాగునీటి కలుషితంపై ఆందోళన**



వేంపల్లె సెప్టెంబర్ 3 (కదిలించే వార్త):ఇడుపులపాయలో ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో స్థానిక సమస్యలను జనసేన నాయకుడు పోతిరెడ్డి చలపతి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఓటర్ల జాబితాలో తప్పులు, అభ్యంతరాలు ఉంటే పరిశీలించి అధికారులకు తెలియజేయాలని ఎంపీడీవో సూచించారు. ఈ సందర్భంగా పోతిరెడ్డి చలపతి మాట్లాడుతూ.. మారుతినగర్‌లోని పాఠశాల సమీపంలో కొందరు పందులను పెంచుతుండటంతో తీవ్ర దుర్వాసన, అపరిశుభ్రత నెలకొన్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పైప్‌లైన్ లీకేజీల కారణంగా మురుగునీరు తాగునీటి పైప్‌లైన్లు, ట్యాంకుల వద్దకు చేరుతోందని, దీనివల్ల ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల, నివాస ప్రాంతాల సమీపంలో పందుల పెంపకాన్ని తొలగించడంతో పాటు పైప్‌లైన్ లీకేజీలను వెంటనే అరికట్టి ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని ఎంపీడీవోను కోరారు. దీనిపై ఎంపీడీవో సానుకూలంగా స్పందిస్తూ సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## జాతీయ స్థాయి యోగా పోటీలకు కడప జిల్లా క్రీడాకారుల ఎంపిక



వేంపల్లె సెప్టెంబర్ 3 (కదిలించే వార్త):

విశాఖపట్నంలో ఆగస్టు 29, 30 తేదీల్లో జరిగిన 51వ ఆంధ్రప్రదేశ్ యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2026లో వైఎస్సార్ కడప జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ప్రొద్దుటూరుకు చెందిన బి. కృష్ణవేణి, కడపకు చెందిన ఎల్. శ్రీరాములు రెడ్డి తమ విభాగాల్లో నాలుగో స్థానంలో నిలిచి కన్సోలేషన్ పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించారు. ఈ నెల 29న బీహార్‌లోని పాట్నాలో జరగనున్న జాతీయ స్థాయి యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌కు వీరిద్దరూ అర్హత సాధించినట్లు జిల్లా సెక్రటరీ తేజ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం శ్రీకాంత్ రెడ్డి క్రీడాకారులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రాచవీటి మారన్న, రాజు, శ్రీరామ్ రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

వేంపల్లె సెప్టెంబర్ 3 (కదిలించే వార్త):


వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలోని శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కే. సుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారు శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి అర్చకులు హరి ప్రవీణ్, తిరుమల వేణు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో వేడుకల్లో పాల్గొననున్నారని, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే ఉట్లోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని ఈఓ కే. సుభాష్ కోరారు.

## చిలకం మధుసూదన్ రెడ్డి నూతన గృహంలో ఘనంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం



కదిలించే వార్త సెప్టెంబర్ 3:ధర్మవరం: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి శివరాం నగర్‌లో నూతనంగా నిర్మించిన గృహంలో నూతన దంపతులు చిలకం జయవర్ధన్ రెడ్డి--శ్రావ్య దంపతుల ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బంధుమిత్రులు, శ్రేయోభిలాషులతో పాటు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు. నూతన దంపతులను ఆశీర్వదించి, శ్రీ సత్యనారాయణ స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా నూతన దంపతులు చిలకం జయవర్ధన్ రెడ్డి--శ్రావ్యలకు శ్రీ సత్యనారాయణ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని చిలకం మధుసూదన్ రెడ్డి దంపతులు ఆకాంక్షించారు.






# తాగునీటి పైపులు పగిలితే మరమ్మతులు చేసేది ఎవరు?

**రోడ్డు విస్తరణ పనులతో పైపులైన్లు ధ్వంసం.. వృథాగా పోతున్న తాగునీరు**

**కలుషిత నీటితో ప్రజల్లో ఆందోళన**



వేంపల్లె సెప్టెంబరు 3 (కదిలించే వార్త):

వేంపల్లె పట్టణంలోని కడప రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు ప్రజలకు తాగునీటి సమస్యను తెచ్చిపెడుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా జేసీబీలతో మట్టి తొలగిస్తుండగా తాగునీటి మెయిన్ పైపులైన్లు, ఇంటి కనెక్షన్ పైపులు పలుచోట్ల పగిలిపోయాయి. దీంతో పైపుల్లోని తాగునీరు రోడ్డు విస్తరణ కోసం తీసిన గుంతల్లోకి చేరి వృథాగా పోతోంది. పైపులు పగిలితే మరమ్మతులు చేసేది ఎవరు? అన్న ప్రశ్నకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీ అధికారులా? రోడ్లు భవనాల శాఖ అధికారులా? పనులు చేపడుతున్న కాంట్రాక్టరా? లేక ఇంటి యజమానులా? అనే అయోమయంలో ప్రజలు ఉన్నారు. మరోవైపు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన తర్వాత మళ్లీ కరెంట్ వచ్చినప్పుడు ఇంటి మోటార్లు ఆన్ చేస్తే పైపులైన్ల ద్వారా కలుషిత నీరు ఇళ్లలోకి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేంపల్లిలో విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో కలుషిత నీరు తాగునీటి కుళాయిల ద్వారా ఇళ్లకు చేరితే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పైపులైన్లు దెబ్బతిన్నందున వాటిని వెంటనే మరమ్మతులు చేయాల్సిన బాధ్యతను సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. "మాకు సంబంధం లేదు" అంటూ అధికారులు, కాంట్రాక్టర్ చేతులు దులుపుకుంటే ప్రజలే నష్టపోవాల్సి వస్తుంది అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పంచాయతీ అధికారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ వెంటనే స్పందించి పగిలిన తాగునీటి పైపులైన్లను మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని, ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వేంపల్లి ప్రజలు కోరుతున్నారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో డిగ్రీ ప్రవేశాలు

**సెప్టెంబరు 15 వరకు దరఖాస్తులకు అవకాశం**

**ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉషశ్రీ**



వేంపల్లె సెప్టెంబరు 3 (కదిలించే వార్త):

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వేంపల్లి వై.ఎస్.ఆర్. వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో 2026--27 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉషశ్రీ తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ లేదా మూడేళ్ల డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రవేశాలకు వయసు పరిమితి లేదని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగులు, గృహిణులు, ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్టడీ సెంటర్‌లో బీఏలో హిస్టరీ--ఎకనామిక్స్--పొలిటికల్ సైన్స్, పొలిటికల్ సైన్స్--సోషియాలజీ--పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బీఎస్సీలో మ్యాథ్స్--ఫిజిక్స్--కెమిస్ట్రీ, మ్యాథ్స్--ఫిజిక్స్--కంప్యూటర్ సైన్స్, బోటనీ--జువాలజీ--కెమిస్ట్రీ, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సెప్టెంబరు 15లోపు వేంపల్లి స్టడీ సెంటర్‌ను సంప్రదించి లేదా యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకుని ప్రవేశాలు పొందాలని డాక్టర్ ఉషశ్రీ కోరారు. మరిన్ని వివరాలకు 94945 54324, 94940 81882 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

# ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తాం

**ఏ.పి.జే.ఏ.సి.రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి.విద్యా సాగర్**




పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 3

ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటం నిర్వహిస్తామని ఉద్యోగులకి దక్కాల్సిన పెండింగ్ బకాయిలు అనగా పి ఆర్ సి కమిటీ నియామకం, మధ్యంతర భృతి, డి.ఏ లు విడుదల, సరెండర్ లీవులు బకాయిలు, సచివాలయం ఉద్యోగుల పలు సమస్యల పరిష్కారం, ఇంకా మిగిలిన బకాయిల విషయమై ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలను చర్చలకి ఆహ్వానించి సత్వర నిర్ణయాలు తీసుకోవాలని మరియు ఏ.పి.జే ఏ.సి.రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి.విద్యా సాగర్ , ప్రధాన కార్యదర్శి డి.వి రమణ ఆదేశాల మేరకు ఏ నిర్ణయానిలయం తాము సిద్ధంగా ఉన్నామని పులివెందుల ఏపీ ఎన్ జి జి ఓస్ తాలూకా అధ్యక్షులు గజ్జల జగన్నాథ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణం లోని ఎన్ జి ఓస్ భవనంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చర్చలు విఫలమైతే ఉద్యమ కార్యాచరణకు తాము సన్నద్ధంగా ఉంటామని సంఘీ భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల తాలూక అధ్యక్షులు గజ్జల జగన్నాథ రెడ్డి, ట్రెజరర్, రామగంగాధర రెడ్డి యాదవ్, అసోసియేట్ సెక్రటరీ .సుకుమార్, ఉపాధ్యక్షులు వై. ప్రభు కుమార్, ఉపాధ్యక్షులు జి.శంకరయ్య, పెన్షనర్లు అధ్యక్షులు .గురుప్రసాద్ స్వర్ణ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.



# ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇచ్చే వరకు ఉద్యమం ఆగదు:

**కాయపాటి రామాంజనేయులు**

పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 3

యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ గురువారం విజయవాడలోని విద్యా భవన్ ముట్టడి కార్యక్రమంలో యుటిఎఫ్ పులివెందుల ప్రాంతీయ కన్వీనర్ కాయపాటి రామాంజనేయులు ని అరెస్టు చేసి తాడేపల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన మూడు నెలల నుండి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్ట సవరణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి అనేకమార్లు ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఆలోపు ఉపాధ్యాయులకు స్పెషల్ టేటును ఆఫ్లైన్ విధానంలో నిర్వహించి అందరికీ సమానంగా అర్హత మార్కులను 40 శాతానికి తగ్గించాలని మరియు సంబంధిత సబ్జెక్టు నుండి మాత్రమే ప్రశ్నావళి ని రూపొందించి పరీక్ష నిర్వహించాలని కోరడం జరిగింది. అందుకు విద్యాశాఖ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ పేరుతో నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. కానీ ఆ నోటిఫికేషన్ లో ఉపాధ్యాయులు గాని మరియు ఉపాధ్యాయ సంఘాలు గాని ప్రాతినిధ్యం చేసిన ఏ రాయితీలు ఇవ్వకుండా పాత విధానాలనే కొనసాగిస్తూ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. దీనికి నిరసనగా మా న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు విజయవాడలోని విద్యా భవన్ ను పెద్ద సంఖ్యలో ముట్టడించడం జరిగింది. కానీ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించడం చాలా దారుణమని అన్నారు. ఇంతటితో ఈ ఉద్యమం ఆగదని, ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇచ్చే వరకు ఉద్యమిస్తామని, ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక దీక్షలకు ఆ తరువాత ఆమరణ నిరాహార దీక్షలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు ,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అర్హత లేకుండా ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఫాదర్ సునీల్‌పై చర్యలు తీసుకోవాలి



కడప, సెప్టెంబర్ 3: కదిలించే వార్త

పోరుమామిళ్లలోని హోలీ రోసరి స్కూల్‌లో ఎలాంటి విద్యార్హతలు లేకున్నా ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న ఫాదర్ సునీల్ కుమార్‌పై విచారణ జరిపి క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షులు సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో కడప జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల టీసీలు, ఐడీ కార్డులపై ప్రిన్సిపాల్ హోదాలో సునీల్ కుమార్ సంతకాలు చేస్తున్నారని ఆరోపించారు. తాను ప్రిన్సిపాల్‌ను కాదని, కేవలం కరస్పాండెంట్‌నని ఇటీవల ఆయన పేర్కొన్నారని, అలాంటప్పుడు ప్రిన్సిపాల్‌గా సంతకాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకులు జీవన్, కుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## దేవుని కడప నాలుగు బ్రిడ్జిల పరిశీలన

**తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి. కమిషనర్ భవాని ప్రసాద్.**



కడపసెప్టెంబర్ 3 కదిలించే వార్తఎన్నో ఏళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోని దేవుని కడప రోడ్డు కోసం దేవుని కడప చెరువు వద్ద ఉన్న నాలుగు బ్రిడ్జిలను తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, ఆర్ అండ్ బి అధికారులతో కలిసి గురువారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి కృష్ణా సర్కిల్ నుండి దేవుని కడప రింగురోడ్డు వరకు నాలుగు లైన్లు రోడ్ల కొరకు ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని తెలిపారు. ఈ రోడ్డును కృష్ణ సర్కిల్ నుంచి పెట్రోల్ బంక్ వరకు వచ్చింది. కానీ అక్కడి నుండి ముందుకు సాగాలంటే నాలుగు బ్రిడ్జిలు కట్టాల్సి ఉంది. కాబట్టి వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ఆర్ అండ్ బి అధికారులను, కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలన చేసే 8 కోట్ల పైబడి ఖర్చుపెట్టి అత్యంత సుందరంగా రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ వీర హౌస్ డెవలప్మెంట్ చైర్మన్ చైర్మన్ మురికి నాటి శ్రీధర్, ఏ మునిస్వామి, ఏం బాలకృష్ణ , వెంకట సిసింద్రీ, దేవుని కడప ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖండాంతరాలు దాటిన వైఎస్సార్ అభిమానం

## గల్ఫ్ దేశాల్లో మహానేత వైఎస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

కడప, సెప్టెంబర్ 3 కదిలించే వార్త






మహానేత, దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా గల్ఫ్ దేశాల్లో ఆయన అభిమానులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళు లర్పించారు. కువైట్, దుబాయ్ (యూఏఈ), ఖతార్, బహరైన్, సౌదీ అరేబియాలోని జుబైల్, ఒమాన్ (మస్కట్) ప్రాంతాల్లో వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. కువైట్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో, దుబాయ్‌లో గల్ఫ్ కో–కన్వీనర్ మహమ్మద్ జిలాన్ బాషా ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు సుధాకర్ రెడ్డి, ప్రసన్న సోమిరెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఖతార్‌లో కన్వీనర్ జాఫర్ హుస్సేన్, గల్ఫ్ కో–కన్వీనర్ దొండపాటి శశికిరణ్ ఆధ్వర్యంలో, బహరైన్‌లో కన్వీనర్ ఓర్సు నాగరాజు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. సౌదీ అరేబియాలోని జుబైల్‌లో కన్వీనర్ షేక్ ఇలాహి ఆధ్వర్యంలో, ఒమాన్‌లో కన్వీనర్ భాస్కర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుంటూ 'జోహార్ వైఎస్సార్' అంటూ నివాళులు అర్పించారు.

సంక్షేమ పథకాలతో చెరగని ముద్ర

వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేశారని నాయకులు గుర్తు చేసుకున్నారు. ఆరోగ్యశ్రీ, 104, 108 ఉచిత అంబులెన్స్ సేవలు, పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో ఆయన చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు.

పేదలు, రైతులు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందని వారు కొనియాడారు. వైఎస్సార్ భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన ఆశయాలు, సంక్షేమ పాలన, ప్రజల పట్ల చూపిన అభిమానం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. భూమి, ఆకాశం, సూర్యచంద్రులు ఉన్నంతకాలం మహానేత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రపంచవ్యాప్తంగాఉన్నతెలుగుప్రజలహృదయాల్లోశాశ్వతంగానిలిచిపోతారని నాయకులు పేర్కొన్నారు.




# కమల్ అమృత్ వాణి-247



స్వప్నం దృష్ట్వా న తిష్ఠేత కార్యరూపం సమాచరేత్।
క్రియయా సఫలం స్వప్నం న కేవలవిచారణాత్॥

తాత్పర్యం.

కలలు కనడం జీవితానికి ప్రేరణ, కానీ వాటిని సాకారం చేయడానికి కార్యాచరణ అవసరం.కేవలం ఆలోచిస్తూ కూర్చుంటే ఏ లక్ష్యమూ నిజం కాదు.స్పష్టమైన లక్ష్యంతో మొదటి అడుగు వేయాలి.

చిన్న ప్రయత్నాలు క్రమంగా పెద్ద విజయాలకు దారి తీస్తాయి. తప్పులు జరిగినా, వాటి నుంచి నేర్చుకుంటూ ముందుకు సాగాలి.ప్రయత్నం లేని ఆశ కేవలం ఊహగానే మిగిలిపోతుంది.సంకల్పానికి శ్రమ తోడైతే స్వప్నం సాకారమవుతుంది.

కలలకు రెక్కలు ఇచ్చేది ఆలోచన అయితే, వాటిని గమ్యానికి చేర్చేది ఆచరణ.

-- కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

## సీబీఆర్ నుంచి పీఏబీఆర్ కుడి కాలువకు 1 టీఎంసీ వరద నీటిని తరలించాలి

**బత్తలపల్లి, తాడిమర్రి మండలాలకు తాగునీరు.. 45,800 ఎకరాలకు సాగునీటి ప్రయోజనం**

**సీబీఆర్--పీఏబీఆర్ కుడి కాలువ చివరి ప్రాంత ఎత్తిపోతల పథకానికి ఆమోదం ఇవ్వాలి**

**1 టీఎంసీ నీటి కేటాయింపులు మంజూరు చేయండి**

**సీబీఆర్ జలాలతో వ్యవసాయానికి ఊతం.. 45,800 ఎకరాలకు ప్రయోజనం**

**హార్టికల్చర్ హబ్ లక్ష్యానికి సీబీఆర్ జలాలు కీలకం**



జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖరాష్ట్ర సచివాలయం, కదిలించే వార్త, సెప్టెంబర్ 03:--: ధర్మవరం నియోజకవర్గంలోని కరువు ప్రభావిత బత్తలపల్లి, తాడిమర్రి మండలాల తాగునీటి, సాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) నుంచి 1 టీఎంసీ జీఎన్ఎస్ఎస్ వరద నీటిని పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువ చివరి ప్రాంతానికి తరలించే ఎత్తిపోతల/ప్రెజర్ మెయిన్ పథకాన్ని మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కోరారు. ఈ మేరకు గురువారం అమరావతిలో మంత్రి నిమ్మల రామానాయుడికి స్వయంగా లేఖ అందజేసి, ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి, తాడిమర్రి మండలాల తీవ్ర నీటి సమస్యను వివరించి, ప్రతిపాదిత పథకానికి తక్షణ ఆమోదం ఇవ్వాలని కోరారు.

లిపీఏబీఆర్ కుడి కాలువకు నీటి కొరతతో చివరి ప్రాంతాలు ఇబ్బందులు....

గతంలో నిర్మించిన పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా ధర్మవరం సహా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కరువు ప్రాంతాలకు తాగునీరు, సాగునీటి ప్రయోజనాలు అందించడంతోపాటు కాలువ పరిధిలోని చెరువులను స్థిరీకరించేవారని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అయితే పీఏబీఆర్ జలాశయంలో తగినంత నీటి లభ్యత లేకపోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా ధర్మవరం బ్రాంచ్ కాలువతోపాటు పీఏబీఆర్ కుడి కాలువ చివరి ప్రాంతాలకు హామీ మేరకు నీరు అందడం లేదని పేర్కొన్నారు. గత సంవత్సరాల్లో నీటి విడుదల, చెరువుల నింపుదల పరిస్థితులను పరిశీలిస్తే ఈ సమస్య తీవ్రత స్పష్టమవుతుందని తెలిపారు. దీంతో పీఏబీఆర్ కుడి కాలువ చివరి ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రరూపం దాల్చి, ముఖ్యంగా బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.

10.23 టీఎంసీల సామర్థ్యం ఉన్న సీబీఆర్ నుంచి 1 టీఎంసీ తరలింపు....

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) కీలకమైన నీటి వనరుగా ఉపయోగపడుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. చిత్రావతి నదిపై వైఎస్సార్ కడప జిల్లా లింగాల మండలం పర్ణపల్లి గ్రామం సమీపంలో, శ్రీ సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలానికి సమీపంలో నిర్మించిన సీబీఆర్‌కు 10.23 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. సీబీఆర్ దిగువ భాగంలో అందుబాటులో ఉండే జీఎన్ఎస్-ఎస్ వరద నీటిలో 1 టీఎంసీని ఎత్తిపోసి, పీఏబీఆర్ కుడి కాలువ చివరి ప్రాంతంలోని మన్నీల గ్రామం వద్ద సుమారు 93.000/93.500 కిలోమీటర్ ప్రాంతానికి ప్రెజర్ మెయిన్ ద్వారా తరలించే ప్రతిపాదనను మంత్రి లేఖలో వివరించారు.

48 చెరువులు.. 24 చెక్‌డ్యామ్‌లకు నీరు....

సీబీఆర్ నుంచి 1 టీఎంసీ నీటిని పీఏబీఆర్ కుడి కాలువకు తరలించడం ద్వారా కాలువ పరిధిలోని 48 చెరువులు, 24 చెక్‌డ్యామ్‌లకు నీటిని అందించే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. దీంతో కేవలం తాగునీటి సమస్య పరిష్కారం కావడమే కాకుండా, చెరువుల నింపుదల ద్వారా భూగర్భ జలమట్టాలు పెరిగి, చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయానికి మరింత స్థిరమైన నీటి వనరులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

బత్తలపల్లి, తాడిమర్రి మండలాలకు తాగునీటికి శాశ్వత పరిష్కారం....

ప్రతిపాదిత పథకం అమలైతే బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో తాగునీటి అవసరాలకు గణనీయమైన మద్దతు లభిస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అదేవిధంగా చెరువులు, చెక్‌డ్యామ్‌లకు నీరు చేరడం ద్వారా భూగర్భ జలమట్టాలు మెరుగుపడటంతోపాటు, కరువు ప్రభావిత ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా నీటి లభ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ పథకం వల్ల వ్యవసాయం, ఉద్యానవన రంగాల అభివృద్ధికి ఊతం లభించడంతోపాటు పశుపోషణ కార్యకలాపాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని మంత్రి తెలిపారు. అలాగే ప్రాంతంలోని పర్యావరణ సమతుల్యత మెరుగుపడేందుకు ఈ పథకం దోహదపడుతుందని వివరించారు.

హార్టికల్చర్ హబ్ లక్ష్య సాధనకు దోహదం....

ధర్మవరం నియోజకవర్గాన్ని ఉద్యాన పంటల అభివృద్ధికి అనువైన ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ప్రతిపాదిత పథకం కీలకంగా ఉపయోగపడుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రత్యేకంగా హార్టికల్చర్ హబ్ లక్ష్యాన్ని సాధించేందుకు నీటి లభ్యత ఎంతో అవసరమని, సీబీఆర్--పీఏబీఆర్ నీటి తరలింపు పథకం ఉద్యానవన రంగ అభివృద్ధికి గణనీయమైన తోడ్పాటును అందిస్తుందని పేర్కొన్నారు.

45,800 ఎకరాలకు సాగునీటి ప్రయోజనం....

ఈ పథకం అమలైతే బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లోని మొత్తం 45,800 ఎకరాల వ్యవసాయ, ఉద్యాన పంటలకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో బత్తలపల్లి మండలం -- 21,900 ఎకరాలు, తాడిమర్రి మండలం -- 23,900 ఎకరాలు మొత్తం -- 45,800 ఎకరాలు సాగునీటి ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

1 టీఎంసీ నీటి వినియోగానికి స్పష్టమైన ప్రతిపాదన....

మొత్తం 1 టీఎంసీ నీటిలో సుమారు 559.57 ఎంసీఎఫ్‌టీని చెరువుల నింపుదలకు, మరో 440.43 ఎంసీఎఫ్‌టీని బత్తలపల్లి, తాడిమర్రి మండలాల తాగునీటి అవసరాలకు వినియోగించేలా ప్రతిపాదన రూపొందించినట్లు మంత్రి తెలిపారు. ఈ విధంగా ఒకే పథకం ద్వారా చెరువుల స్థిరీకరణ, తాగునీటి సరఫరా, వ్యవసాయ--ఉద్యాన పంటలకు ప్రయోజనం, భూగర్భ జలాల పెంపు వంటి అనేక ప్రయోజనాలు కలిగే అవకాశం ఉందని వివరించారు.

రిజర్వాయర్ కోసం భూములిచ్చిన తాడిమర్రి మండలానికి ప్రయోజనం కల్పించాలి....

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం కోసం తాడిమర్రి మండలానికి చెందిన భూములు వినియోగించిన విషయాన్ని కూడా మంత్రి సత్యకుమార్ యాదవ్ తన లేఖలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. రిజర్వాయర్‌లో నిల్వ అవుతున్న నీటిలో కొంత భాగాన్ని సమీపంలోని కరువు ప్రభావిత ప్రాంతాల అవసరాలకు మళ్లించడం ద్వారా తాడిమర్రి, బత్తలపల్లి మండలాల ప్రజలకు తాగునీరు, సాగునీటి ప్రయోజనాలు అందించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు.

సూత్రప్రాయ ఆమోదం ఇచ్చి.. డీపీఆర్ సిద్ధం చేయాలి....

ప్రాంతంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులు, ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీబీఆర్--పీఏబీఆర్ కుడి కాలువ చివరి ప్రాంత ఎత్తిపోతల/తాగునీటి పథకానికి సూత్రప్రాయ ఆమోదం ఇవ్వాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 1 టీఎంసీ జీఎన్ఎస్ఎస్ వరద నీటిని పీఏబీఆర్ కుడి కాలువ చివరి ప్రాంతానికి తరలించేందుకు అవసరమైన నీటి కేటాయింపులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సంబంధిత అధికారులను ఆదేశించి అంచనాలు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను తక్షణమే సిద్ధం చేయించి, పనులను ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కోరారు. ధర్మవరం నియోజకవర్గంలోని కరువు ప్రభావిత ప్రాంతాల తాగునీటి, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ఈ ప్రతిపాదనపై తక్షణ చర్యలు తీసుకుని, పథకానికి అనుమతులు మంజూరు చేసి అమలు చేసేలా సహకరించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.

## డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోటా ద్వారా ఎస్ వి వైద్య కళాశాలలో మొదటి విడత ఎంబీబీఎస్ ప్రవేశాలు ప్రారంభం

తిరుపతి రూరల్ కదిలించే వార్త సెప్టెంబర్ 3 తిరుపతిలో గురువారము ఎస్ వి వైద్య కళాశాలలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోటా క్రింద 2026-2027 సంవత్సరానికి గాను ఎంబీబీఎస్, వైద్య విద్యార్థుల ప్రవేశాలు ప్రారంభమైనవిని, ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు ఈ సందర్భంగా మాట్లాడుతూమొదటి విడత కౌన్సెలింగ్లో ఈరోజు దాదాపు 34 మంది ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు గా ప్రవేశాలు తీసుకున్నారని తెలిపారు. రేపు శ్రీ కృష్ణాష్టమి సెలవు సందర్భంగా కూడా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోటా క్రింద ఎస్వీ వైద్య కళాశాలకు మొత్తం 204 సీట్లు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ద్వారా కేటాయించగా, వారిలో మొదటిరోజు 34 మంది హాజరయ్యారు.మొదటిరోజు ఎంబీబీఎస్ ప్రవేశాలు పొందిన విద్యార్థిని విద్యార్థులు1శివకుమార్ హేమంత్ సంధ్యారెడ్డి, బి సి ఏ కోటా క్రింద 548 మార్కులు పొందిన విద్యార్థిని 2026-2027 సంవత్సరానికి గాను మొదటి అడ్మిషన్ తీసుకోవడం జరిగినది.2చల్లా లింగా హర్షవర్ధన్ రెడ్డి ఓసి కోట క్రింద 543 మార్కులు పొందిన విద్యార్థి.3బోనత్ లిఖిత్ రామ్ ఎస్టి కోట క్రింద 482 మార్కులు పొందిన విద్యార్థి.4షేక్ మొహమ్మద్ అద్లీ బీసీఈ కోటా క్రింద 531 మార్కులు పొందిన విద్యార్థులు మొదటి విడతలో ఎంబీబీఎస్ ప్రవేశాలు పొందడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అడ్మిన్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ అకడమిక్ డాక్టర్



డి.సత్యనారాయణ మూర్తి, డాక్టర్ భాగ్యలక్ష్మి, ఫిజియాలజీ విభాగాధిపతి, డాక్టర్ విజయ్ కుమార్ మైక్రో బయాలజీ, విద్యార్థి విభాగం జూనియర్ అసిస్టెంట్ అరుణ్ బాబు, నీలారాణి,మరియు పి ఆర్ ఓ వీర కిరణ్ తదుతరులు విద్యార్థులను అభినందించారు.

## తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ యొక్క 25 సంవత్సరాల భక్తిపూరిత ప్రయాణానికి గుర్తుగా తపాల శాఖచే

తిరుపతి కదిలించే వార్త 3 సెప్టెంబర్



తిరుపతి లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక తపాల కవర్ ఆవిష్కరణ. దేశంలోని ప్రధాన నగరాలకు దీటుగా వినాయక చవితి పండుగను మరియు సామూహిక నిమజ్జన మహోత్సవమును క్రమశిక్షణతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుటకు గత 25 సంవత్సరములగా తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కృషి చేయుచున్నది తిరుపతి పవిత్ర తిరుపతి నగరానికి ఉన్న ప్రత్యేకత దృష్ట్యా భక్తి పూర్త వాతావరణం లో భారతీయ సనాతన ధర్మం ద్వారా సమాజాన్ని ఐక్యంగా ఉంచడం సర్వేజనా సుఖినోభవంతు అంటూ అందరి శ్రేయస్సు కోరుకునే విధంగా మన పండుగలు మన సంస్కృతి ఆదర్శంగా నిలుస్తున్నది. అటువంటి సంస్కృతిని కాపాడుకుంటూ తిరుపతి నగరాన్ని ఆదర్శంగా ఉంచేందుకు ఉత్సవ కమిటీ అందరి సహకారంతో 25వ వసంతంలో అడుగుపెడుతున్న సందర్భంగా తపాలా శాఖ సహకారంతో ప్రత్యేక పోస్టల్ కవర్లు ఆవిష్కరించుకోవడం గొప్ప అనుభూతినిస్తోందని కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో వెన్నం ఉపేంద్ర , శ్రీ, పోస్టుమాస్టర్ జనరల్, కర్నూల్ రీజియన్,వీ. సుధాకర మాల్య, శ్రీ, డైరెక్టర్ పోస్టల్ సర్వీసెస్, కర్నూల్ రీజియన్. సతీష్ గోపరాజు , అసిస్టెంట్ డైరెక్టర్ సర్కిల్ రీజియన్, పాల్గొన్నారు.

## పారదర్శకతకు పెద్ద పీట వేసి..పేద కుటుంబాలకు అండగా నిలిచాం..ఎమ్మెల్యే అమిలినేని

**వైసీపీ ప్రభుత్వంలో పోస్టును బట్టి డబ్బులకు ఉద్యోగాలు అమ్ముకున్నారు..**

**పేద ప్రజలకు అండగా నిలిచి వారికి సేవ చేసేందుకు మా ప్రభుత్వం మేము పనిచేస్తున్నాం**

**ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు**



కళ్యాణదుర్గం, కదిలించే వార్త, సెప్టెంబర్ 03 :

కూటమి ప్రభుత్వం పారదర్శకతకు పెద్ద పీట వేసి ఎక్కడా ఎలాంటి అవినీతికి పాల్పడకుండా పేద కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించి వారికి అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు ప్రజావేదికలో కంబదూరు, కళ్యాణదుర్గం ప్రాజెక్ట్ ల పరిధిలోని 38 మందికి అంగన్వాడీ ఆయాలుగా ఉద్యోగ నియామకాలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు చేతుల మీదుగా అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అవినీతికి మారుపేరుగా ఉండి అంగన్వాడీ టీచర్, ఆయా పోస్టులకు రేటు పెట్టి మరి పేదలతో ఆడుకున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ సంస్కృతికి తెరదించి పారదర్శకతకు పెద్ద పీట వేసామని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో పేద ప్రజలకు అండగా నిలబడటం కోసం పనిచేస్తున్నామని తెలిపారు..ఎక్కడ ఏ ఒక్కరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా, పేద కుటుంబాలకు ఉద్యోగాన్ని అందించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు..ఎలాంటి పొరపాట్లకు, చిన్నారులకు సక్రమంగా అన్ని అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఉద్యోగాలు పొందిన వారికి సూచించారు.

## జల్ జీవన్ మిషన్ కింద త్రాగునీటి సరఫరా పనులను రెండు నెలల్లో వేగవంతంగా పూర్తి చేయాలి..

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**జల్ జీవన్ మిషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి త్రాగునీరు అందించాలి.**

**రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత..**




అనంతపురం, కదిలించే వార్త, సెప్టెంబర్ 03 :

అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం రాప్తాడు నియోజకవర్గంలో త్రాగునీటి సరఫరా కోసం చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులపై ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్ఈ, అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లో చేపట్టిన పనుల పురోగతి, ఎంతవరకు పనులు పూర్తయ్యాయి, ఎక్కడెక్కడ పనులు చేపట్టాలి, తదితర అంశాలపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సమీక్ష చేశారు.ఈ సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వీలైనంత త్వరగా గ్రామాలకు త్రాగునీరు అందించాలన్నారు. జల జీవన్ పథకం కింద అనంతపురము రూరల్ మండలంలో సాయి పావని కంపెనీ 40 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించగా, ఇప్పటివరకు రూ.18 కోట్ల పనులు చేశారని, అందులో ఇప్పటివరకు 15 కోట్ల 50 లక్షల రూపాయల బిల్స్ ఇచ్చారని, 2 కోట్ల 50 లక్షలు బిల్స్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందులో ఇంకా 22 కోట్ల రూపాయల పనులు చేయాలన్నారు. ఆత్మకూరు మండలంలో సరస్వతి కంపెనీ 50 కోట్ల 43 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించగా, రూ.38 కోట్ల పనులు చేశారని, వారికి 34 కోట్ల బిల్స్ ఇచ్చారని, ఇంకా 12 కోట్ల 43 లక్షల రూపాయల పనులు చేయాలన్నారు. వారు ఆత్మకూరులో 10 గ్రామాలు, అనంతపురము రూరల్ పరిధిలో 4 గ్రామాలు, రాప్తాడులో 6 గ్రామాలలో పనులు చేస్తున్నారని, 50 శాతం పనులు చేసి మిగిలిన పనులు కాంట్రాక్టర్ పూర్తి చేయలేదన్నారు. సాయి పావని కాంట్రాక్టర్ వారు 31 గ్రామాలలో (కక్కలపల్లి కాలనీ, పాపంపేట, సజ్జల కాలువ, చిన్నంపల్లి, ఆలమూరు, కాటిగానికాలువ, రాచానపల్లి, శ్రీ.ఖ.యూనివర్సిటీ చుట్టూ గ్రామాలు వీటితో పాటు 19 గ్రామాలు) పనులు చేస్తున్నారని, ఇందులో 50 శాతం పనులు చేశారని, మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. త్రాగునీటి సమస్యలు లేకుండా చిన్న చిన్న రిపేర్ ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించి గ్రామాలకు నీటి సరఫరా చేయాలని సూచించారు. పీఏబీఆర్ డ్యాం దగ్గర మెయిన్ పైప్ లైన్ 600 మీటర్లు పెండింగ్ లో ఉందన్నారు. పీఏబీఆర్ డ్యాం దగ్గర ఫిల్టర్ బెడ్స్ పనులు ఇప్పటివరకు మొదలు కాలేదని, డ్యాం దగ్గర క్లియర్ వాటర్ సంపు నుండి ఆత్మకూరుకు పంపింగ్ చేసే మోటర్లు ఇప్పటివరకు ఆర్డర్ పెట్టలేదని, పి.నారాయణపురం మరియు పి.యాలేరు మధ్య హెచ్.ఎన్.ఎస్.ఎస్ కెనాల్ బ్రిడ్జి పనులు పూర్తికాలేదని, 50 శాతం పనులు జరిగాయని, ఆత్మకూరు గ్రామంలో ఓ.హెచ్.ఎస్.ఆర్ ట్యాంక్ పనులు మరియు సంపు పనులు ఇంకా పూర్తి కాలేదని, పంపురూము మరియు మోటర్లు పనులు కూడా పూర్తి కాలేదని, పంపనూరు మరియు చిన్నంపల్లి దగ్గర కట్టాల్సిన మినీ ట్యాంకుల పనులు కూడా పూర్తి కాలేదని, సత్యసాయి కార్మికులు



జీతాలు రావట్లేదని, జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. త్రాగునీటి సరఫరా పనులు వేగవంతంగా చేపట్టినందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద త్రాగునీటి సరఫరా పనులను రెండు నెలల్లో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్.నినో విపత్కర పరిస్థితుల్లో జల్ జీవన్ మిషన్ పనులను రెండు నెలలలోగా వేగవంతంగా పూర్తి చేసి 30 గ్రామాలకు త్రాగునీరు అందించాలని ఆదేశించారు. మౌలిక వసతుల పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రధానంగా పంపింగ్ హౌస్ వద్ద 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పంపింగ్ హౌస్ వద్ద కొత్త సాండ్ ఫిల్టర్లను అమర్చేందుకు చర్యలు చేపట్టాలని, దీనికి సంబంధించిన ఆర్డర్లను వెంటనే పూర్తి చేసి, రాబోయే 2 నెలల్లో పనులను చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుని పూర్తి చేయాలన్నారు. సబ్‌కాంట్రాక్టర్ ద్వారా కిర్లోస్కర్ కంపెనీ పంప్ సెట్ల కోసం ఆర్డర్ ప్రక్రియ వేగవంతం చేయాలని, రాబోయే 3-4 రోజుల్లో పేమెంట్లు పూర్తి చేసి, అధికారికంగా ఆర్డర్ ఖరారు చేయాలన్నారు. సాండ్ ఫిల్టర్లు, పైప్‌లైన్ల డయామీటర్ పెంపు మరియు ఇతర సాంకేతిక మార్పులకు సంబంధించిన రివైజ్డ్ వర్కింగ్ ఎస్టిమేట్లకు వారంలోగా ఎస్ఈ / సీఈ స్థాయి అధికారుల నుండి ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కురుగుంట మరియు సిండికేట్ నగర్ పరిధిలోని మిగిలి ఉన్న 350 మీటర్ల చొప్పున పైప్‌లైన్ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇబ్బందులు ఏవైనా ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలన్నారు.తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున, పిఎఆర్‌బి డ్యామ్ నుండే మనకు ప్రధాన నీటి సరఫరా ఆధారపడి ఉందన్నారు. ప్రతినెల ఈ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రజలకు త్రాగునీటి ఎద్దడి కలగకుండా ఈ పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడమే ప్రాథమిక లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ పనులకు సంబంధించి పీఏబిఆర్ దగ్గర 2.5 ఎకరాల భూమి కావలసి ఉండగా, అందులో 75 సెంట్లు ఇవ్వడం జరగగా, ఇంకా 1.75 ఎకరాలు ఇవ్వాల్సి ఉండగా, వెంటనే త్వరగా ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దానితో పాటు ఒడ్డుపల్లి సబ్ స్టేషన్ వెనుకాల పిపిటి కట్టేందుకు 10 సెంట్లు కావలసి ఉండగా వెంటనే ఇవ్వాలని రెవెన్యూ అధికారులని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, రాప్తాడు డిఈ శ్రీధర్, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# జమ్మూకశ్మీర్ రీ-ఆర్గనైజేషన్ బిల్లు.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు సాధ్యమేనా?



**మొన్న కేంద్ర హోం శాఖామాత్యులు అమిత్ షా లోక్‌సభలో ఒక బిల్లును ప్రవేశ పెట్టారు. అదే జమ్మూకశ్మీర్ రీ-ఆర్గనైజేషన్ బిల్లు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2019లో రాజ్యాంగంలో 370 ప్రకరణం రద్దుచేసి దాని కింద పొందుపరిచిన జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక హోదాను తొలగించింది. ఆ సందర్భంగా ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన విషయం తెలిసిందే. అప్పటినుంచి ఆ ప్రాంతాలు లెఫ్టినెంట్ గవర్నర్ పరిపాలనలో ఉన్నాయి. ఆ తర్వాత అక్కడ ప్రజాస్వామ్య ప్రక్రియను పునరుద్ధరించే దిశగా మొన్న రీ-ఆర్గనైజేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అంటే అక్కడ చట్టసభలను ఏర్పాటు చేయాలని ఆ బిల్లు ఉద్దేశం. అది హర్షణీయమైన చర్యగానే చూడాలి. అయితే ఆ బిల్లులో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో కూడా ఎన్నికలు జరపాలన్న అంశాన్ని చేర్చడం చర్చనీయాంశమైంది.**

ఇక్కడ క్లుప్తంగా చరిత్ర గురించి చెప్పాలి. మనకు బ్రిటిష్ వారు స్వాతంత్ర్యం ప్రకటించినప్పుడు రాజవంశీకుల అధీనంలో ఉన్న సంస్థానాల విషయం ఏమీ తేల్చకుండా వారి ఇష్టానికి వదిలేసింది. అంటే ఈ సంస్థానాలు స్వతంత్రంగా ఉండవచ్చు లేదా భారత్‌లో కానీ పాకిస్థాన్‌లో కానీ చేరవచ్చు. ఉదాహరణకు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న నిజాం పాకిస్థాన్‌లో చేరాలనుకున్నాడు. అది చారిత్రక సత్యం. అలాగే జమ్మూకశ్మీర్ అనేది మహారాజ హరిసింగ్ ఆధీనంలో ఉన్నది స్వాతంత్ర్యం వచ్చేనాటికి. హరిసింగ్ స్వతంత్రంగానే ఉంటాను గానీ ఏ దేశంలోనూ చేరను అని తీర్మానించుకున్నారు. అయితే అక్కడ ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు తిరుగుబాటు చేశాయి హరిసింగ్‌కు వ్యతిరేకంగా. అప్పుడు ఆయన భారత ప్రభుత్వ సహాయాన్ని అర్థించాడు. భారత ప్రభుత్వం సహాయం కావాలంటే ఆయనను భారతదేశంలో చేరమని ప్రతిపాదించింది అప్పటి ప్రభుత్వం.

ఆ సూచన మేరకు హరిసింగ్ భారతదేశ సార్వభౌమత్వాన్ని అంగీకరిస్తూ ఒక ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచారం వంటి అంశాల మీద అధికారాలు భారత ప్రభుత్వానికి బదలాయించడం జరిగింది. అయితే ఆ రాష్ట్రానికి ఒక ప్రత్యేక స్థానాన్నిచ్చింది భారత ప్రభుత్వం. అక్కడ ఆ రాష్ట్రానికి చెందని భారతీయులు ఆస్తి కొనుగోలు చేసే అవకాశం లేదు. వారికొక రాజ్యాంగం, ఒక జెండా గట్రా ఉండేలా చేసింది ఆ ఒప్పందం కిందనే. క్రమేపీ జమ్మూకశ్మీర్ భారత భూ భాగంలో విడదీయరాని విధంగా కలిసిపోయింది. అయితే మహారాజు హరిసింగ్ మీద జరిగిన తిరుగుబాటు సందర్భంగా జమ్మూకశ్మీర్‌లోని కొంత భూ భాగం పాకిస్థాన్ ఆక్రమణలోకి వెళ్లింది. అదే ప్రస్తుతం పాక్ ఆక్రమిత కశ్మీర్‌గా గుర్తింపు పొందిన ప్రాంతం. ఇది పాకిస్థాన్ ఆధీనంలో ఉన్నదనేది ఎవరూ కాదనలేని వాస్తవం. కానీ, మనం మాత్రం అది భారత భూ భాగమే అని అంటున్నాం.

పాక్ ఆక్రమిత కశ్మీర్, భారత ఆధీనంలోని కశ్మీర్ భూ భాగాల మధ్య ఉన్నదాన్ని వాస్తవ ఆధీన రేఖగా పిలుస్తారు. ఆ వాస్తవ ఆధీనరేఖ దాటి మనం అటు వెళ్లం, వాళ్లు ఇటు రారు. ఆ రేఖను దాటి అవతలికి వెళ్లి పాకిస్థాన్ సైన్యానికి బందీగా చిక్కిన అభినందన్ వర్ధమాన్ అనే భారత వాయుసేన పైలెట్ పేరు నేడు ఎంతమందికి గుర్తుందో కానీ, ఆనాడు దేశం అంతా కూడా వర్ధమాన్ సురక్షితంగా స్వదేశం రావాలని ప్రార్థించారు. మన ప్రార్థనలు ఫలించి ఆయన క్షేమంగా తిరిగివచ్చారు. మళ్లీ చెక్కుచెదరని, మొక్కవోని స్థయిర్యంతో ఆయన వాయుసేన విధుల్లో చేరారు. యావత్ దేశం హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నది. ఈ రేఖకు అటూ ఇటు ఇరుసైన్యాలు మోహరించి ఉంటాయి.


కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు ప్రకారం.. జమ్మూకశ్మీర్‌కు అసెంబ్లీ సీట్ల పునర్విభజనతో పాటు, పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతానికి కూడా కొన్ని సీట్లు కేటాయించారు. అది భారత భూభాగమే కావున అక్కడ కూడా ఎన్నికలు జరుపుతామని కేంద్రం అంటున్నది. మన ఆధీనంలో లేని ప్రాంతంలో మనం ఎలా ఎన్నికలు జరుపుతామనేదే ఇప్పుడు చర్చనీయాంశమైంది. కొద్దిరోజుల్లో పార్లమెంటుకు ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పాక్ ఆక్రమిత కశ్మీర్లో ఎన్నికలు జరుపుతామని పార్లమెంటులో ప్రకటించటం ఇరుదేశాల మధ్య కొత్త వివాదాన్ని లేవనెత్తే ప్రయత్నంగా చూస్తున్నారు విశ్లేషకులు. మనకు హక్కున్నప్పటికీ మన ఆధీనంలో లేని దాన్ని తిరిగి పొందాలంటే దౌర్జన్యంగా లాక్కోవాలి. అలా చేస్తే అవతలి వారు ఊరుకోరు కదా? అందువల్లనే తగాదాలు వస్తుంటాయి. రెండు సైన్యాల మధ్య తగాదా అంటే యుద్ధమే అనుకోవాలి కదా! అణ్వాయుధాలు కలిగి యుద్ధం చేసిన చరిత్ర ఉన్న ఇరుదేశాల మధ్య ఘర్షణ అంటే అది రెండువైపులా అలజడి, ఆందోళన కలిగించే అంశం అనటంలో సందేహం లేదు.

పాక్ ఆక్రమిత కశ్మీర్ మహారాజు హరిసింగ్ రాజ్యంలోని అంతర్భాగమే. అది తిరుగుబాటు ద్వారా పాకిస్థాన్ ఆధీనంలో ఉందిగానీ హరిసింగ్‌తో జరిగిన ఒప్పందం ప్రకారం ఆ ప్రాంతం మనదే అన్నది మన వాదన. వాదన ఎలా ఉన్నప్పటికీ వాస్తవంగా అది మన ఆధీనంలో లేదు. ప్రతిపాదిత అసెంబ్లీలో ఆ ప్రాంతానికి కూడా కొన్ని సీట్లు కేటాయించటం వరకు సరే. ఆ ప్రాంతం మనది కాబట్టి అక్కడ కొన్ని సీట్లు కేటాయించటం సమంజసమే. అట్లా చెయ్యకపోతే దానిమీద మనం హక్కును వదులుకున్నట్టుగానే భావించే ప్రమాదం ఉన్నది. కశ్మీర్‌లో ఎన్నికలు జరిగినా, ఆ సీట్లు అలాగే ఖాళీగా ఉంటాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు కేటాయించిన సీట్లు అలాగే ఖాళీగా ఉంటాయి. అత్తారింటికి దారేదిలో సునందకు చెందిన షేర్లా కుర్చీ అలాగే ఎవరూ కూర్చోకుండా ఖాళీగా ఉంచినట్టు. ఏదో ఒకరోజు తిరిగి రాకపోతుందా అన్న ఆశ ఉంది అక్కడ. మనం కూడా సెంటిమెంటల్‌గా ఆ సీట్లను ఖాళీగా ఉంచటం వరకు ఓకే. మనది కాబట్టి మన ఆధీనంలో లేకపోయినా అక్కడికి పోయి ఎన్నికలు జరుపుతామనుకోవటంలో సెంటిమెంటల్ అంశం కాస్తా మెంటల్ అంశంగా మారి లేనిపోని అనర్థాలకు దారితీసే ప్రమాదం ఉన్న విషయాన్ని మనం మరువరాదు!

ఎందుకంటే పాకిస్థాన్ ఆధీనంలో ఉన్న భూ భాగంలో మనం ఏ విధంగా ఎన్నికలు జరుపుతాం?ఆ భూమి మనదే అనటం ఒక ఎత్తు. అక్కడికి పోవాలనుకోవటం మరో ఎత్తు. అక్కడికి పోయే అవకాశం లేకపోయినా అక్కడ కూడా ఎన్నికలు జరుపుతామనటం ఉత్తర కుమార ప్రగల్భాలు అనుకోవాలి. ప్రగల్భాలతో సరిపెడితే సరే. అంతవరకూ ఏ ఇబ్బంది లేదు. కానీ పార్లమెంటుకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ఎన్నికల సమయానికి ప్రభుత్వానికి సాధించామని చెప్పుకోవటానికి ఏ అంశమూ లేక ఏదో చేశామని చూయించుకోవటానికి ఏదైనా సాహసానికి దిగితే అది ఇరుదేశాల మధ్య తీవ్ర సమస్యగా పరిణమించే ప్రమాదం ఉన్నది. ఇదే విజ్ఞులను, విశ్లేషకులను, పరిశీలకులను భయపెడుతున్నది.

అంతర్గత విషయాలను విదేశీ వ్యవహారాలు ప్రభావితం చెయ్యటమనేది ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు కొత్తేమీ కాదు. 1971లో పాకిస్థాన్ యుద్ధం చేసి బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన తర్వాత మన పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ఆ సంఘటన ప్రభావం చాలా ఉన్నది. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని అపరకాళితో పోల్చింది యావత్ భారతదేశం. నేటి బీజేపీ ప్రభుత్వానికి ఇప్పటిదాకా అంశం ఏదీ లేదు ప్రజలకు చూయించుకోవటానికి.

బీజేపీకి ఉన్న అంశాలన్నీ అనుత్పాదక అంశాలే. అయోధ్యలో మందిర నిర్మాణం కానీ, నూతన పార్లమెంటు భవన నిర్మాణం కానీ, 370 అధికరణం రద్దు గానీ, చంద్రయాన్-3 విజయం కానీ ప్రజల జీవితాన్ని ప్రభావితం చేసే ఉత్పాదక అంశాలు కావు. భావోద్వేగ అంశాలే కానీ, దేశ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచామని చెప్పుకోవటానికి పనికొచ్చే అంశాలు కాదు. అటువంటి సందర్భాల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే అవకాశం ఉన్న అంశం ఇది. అందుకే ప్రజాభిప్రాయం స్థిరంగా నిలిచి ప్రభుత్వ ఆలోచనకు బ్రేకు వేసేదిగా ఉండాలి. ఇరు దేశాల మధ్య ఇప్పుడున్న సమస్యలు చాలు. కొత్త సమస్యలు అవసరం లేదు. రెండువైపులా ప్రజలు శాంతినే కోరుకుంటున్నారు. అమెరికా, ఇంగ్లాండ్ లాంటి దేశాల్లో నివసించే భారతీయులు, పాకిస్థానీయులు ఎంతో స్నేహపూర్వకంగా ఉంటారు. ఇద్దరి మధ్య సంబంధ బాంధవ్యాలను నెలకొల్పే ఉమ్మడి అంశాలు ఎన్నో ఉన్నాయి. వాటిని పెంపొందిద్దాం. సుహృద్భావ వాతావరణం కోరుకుందాం.



# రెండో గొంతు

మనదైనది ఏదో వ్యక్తం చేయడానికి మనదైన భాష ఒకటి ఉండాలనుకుంటాం. కానీ భాష చిత్రమైంది. ఒక్కోసారి అనుకున్న మాట వెంటనే తట్టదు. ఇంకో సందర్భంలో ఆ ఒక్కమాటకు పది మాటలు కనబడి గందరగోళ పరుస్తాయి. రెండు సందర్భాల్లోనూ మనిషి మూగ కావడం గమనార్హం. ఇదంతా భాష సమస్య కాదేమోబీ మన లోపలి భావానికి అనుగుణంగా భాష మనల్ని ఇలా ఒంటరిగా మాట తోడులేకుండా నిలబెట్టే స్థితిని కల్పిస్తుందేమో! భావం అనేది చాలా సంక్లిష్టమైంది కదా మరి! దాన్ని భాషలోకి తేవాలని అనుకున్నప్పుడు, ఎంతో తెలుసు అనుకున్నది కూడా, ఏ కొసను అందుకోవాలో తెలియక తికమక పరుస్తుంది. ఒక తేనెతుట్టె ఏదో లోపల కదిలినట్టయి గందరగోళం తలెత్తుతుంది. అనుకున్న వ్యక్తీకరణ గాడి తప్పుతుంది. భావాన్ని వ్యక్తపరచడానికి ఏ భాష అయితే కావాలో అదే అవరోధంగా మారడం తమాషా కదా! మరి దానికేమిటి దారి? సంజ్ఞలైతే పనికిరావు. కాబట్టి మళ్లీ భాషే దిక్కు. పోనీ, ఇంకేదో భాష అయితే? అందులో మనకు అంతగా ప్రవేశం లేనిదైతే? ఒక్కోమాటా వాక్యంగా పేర్చుకునేదైతే? నిజంగా అలా రాయడం సాధ్యమా? ప్రపంచ సాహిత్యంలో పేరెన్నికగన్న కొందరు రచయితలు 'తమది కాని' భాషలో సాహిత్యం సృజించారు. 1978లో బేస్‌బాల్ గేమ్ చూస్తున్నప్పుడు, ఆటగాడు బంతిని బలంగా కొట్టిన బ్యాట్ శబ్దం టోక్యో శివార్లలోని 'జింగు' స్టేడియం మొత్తం ప్రతిధ్వనించిన ఒకానొక క్షణాన ఇరవైల్లో ఉన్న హరూకీ మురకామీకి ఉన్నట్టుండి తానూ రాయగలనని అనిపించింది. ఆ క్షణం ఆయనలో ఏదో ఎల్లలు లేని సృజనావేశం తన్నుకొచ్చింది. దాన్ని అలాగే పోనీయకుండా కొన్ని నెలలు శ్రమించి, రాత్రుళ్లు కుస్తీపట్టి జపనీస్ భాషలో మొదటి నవల రాయడానికి ప్రయత్నించాడు. అంతా అయ్యాక చదివితే ఆయనకే నచ్చలేదు. దీనికి కారణం %--% తన మాతృభాషలో 'పశువుల కొట్టంలో పశువులు క్రిక్కిరిసినట్టుగా' ఆలోచనలు రొద పెట్టడమే! దీనివల్ల ఉక్కిరిబిక్కిరికి లోనయ్యాడు. 'ఒకరి భావాలను అలవోకగా ఒక క్రమంలో పెట్టడం గురించి మాట్లాడటం సులభమేగానీ, అలా చేయడం అంత సులభం కాదు. బొత్తిగా అప్పుడే రాయడం మొదలుపెట్టిన నా లాంటివాడికి అది మరింత కష్టం. కొత్తగా మళ్లీ ప్రారంభించడానికి, నేను చేయాల్సివచ్చిన మొదటి పని నా రాతప్రతుల కుప్పనూ, ఫౌంటెన్ పెన్ నూ వదిలించుకోవడం! అవి నా ముందు ఉన్నంతసేపూ నేనేదో 'సాహిత్యం' లాంటిదాన్ని రాస్తున్నట్టనిపించింది. వాటి స్థానంలోకి నా పాత అలవెటీ టైప్‌రైటర్‌ను అల్మారా లోంచి తెచ్చాను. తర్వాత, ఒక ప్రయోగం లాగా, నా నవల ప్రారంభాన్ని ఇంగ్లీష్‌లో రాయాలని నిర్ణయించుకున్నాను. ఎటూ ఏదైనా కొత్తగా ప్రయత్నించాలనుకున్నప్పుడు ఇలా ఎందుకు చేయకూడదనిపించింది?' అంటూ మురకామీ తాను తన జపనీస్‌ను కాదని ఆంగ్లంలో రాయడానికి పూనుకోవాల్సి వచ్చిన నేపథ్యం చెబుతాడు. అయితే, ఆంగ్లం ఆయనకేమీ మంచినీళ్ల ప్రాయం కాదు. ఈ భాష పరిమితి వల్ల సంక్లిష్ట వాక్యాలు రాయడం కుదరదు. ఆ ఉన్న కొద్దిపాటి పదసంపద, వ్యాకరణాలనే ప్రతిభావంతంగా ఉపయోగించుకోవాలి. 'మై కిచెన్ టేబుల్ ఫిక్షన్ ' ధోరణిగా వర్ణించే ఆయన రచనలు అలా మొదలయ్యాయి. ఈ ధోరణిలో వచ్చిన 'హియర్ ద విండ్ సింగ్' నవలిక మురకామీని అమాంతం పైకి ఎత్తేసింది. కృత్యాదిలోనే మురకామీ అవస్థ పడ్డాడు. కానీ ఝుంపా లాహిరిది ఇంకో కథ. లండన్ లో పుట్టి, అమెరికాలో పెరిగిన భారత(బాంగ్లా) సంతతి ఝుంపా 'ఇంటర్‌ప్రిటర్ ఆఫ్ మాలడీస్' నవలకు 'పులిట్జర్' గెలుచుకుంది. 'నేమ్‌సేక్'తో మరింత పేరొచ్చింది. ఉన్నట్టుండి తన నలభై ఐదేళ్ల వయసులో ఇటాలియన్ లో రాయాలని నిర్ణయించుకుంది. కొత్త భాషలో రాయడంలో ఒక స్వేచ్ఛ ఉంది అంటారామె. 'పర్ఫెక్టుగా ఉండనక్కరలేని స్వేచ్ఛ'. న్యూయార్క్‌లో కొన్ని ఇటాలియన్ పాఠాలు విన్న అనుభవం ఉంది. కానీ ఆ భాష కోసమే 2015లో ఆమె కుటుంబంతో సహా రోమ్‌కు వెళ్లి, కొన్నేళ్లు ఉండివచ్చింది. తర్వాత మూడు పుస్తకాలు ఇటాలియన్ లో వెలువరించింది. తర్వాత అవి ఆంగ్లంలోకి వచ్చాయి. సహజంగానే ఇటాలియన్ లో రాయడమేంటని చాలామందే ఆమెను ప్రశ్నించారు. ఒక్కొక్క పదం, వాక్యం ద్వారా వ్యక్తీకరణను కూడగట్టుకొని కొత్త లోకపు ద్వారంలోకి ప్రవేశించినట్టుగా అనుభూతి చెందానంటుంది. పాత, కొత్త ప్రపంచాల మధ్య అదొక సవాలు కూడా! 'ఇటాలియన్ భాష నా జీవితాన్నేమీ మార్చలేదుబీ అది నాకు రెండో జీవితాన్ని ఇచ్చిందిబీ మరో అదనపు జీవితం'. తన అసంబద్ధ రచన 'వెయిటింగ్ ఫర్ గోడో' ద్వారా ఖ్యాతినొందిన శామ్యూల్ బెకెట్ పుట్టుకతో ఐరిష్‌వాడు అయినప్పటికీ ఫ్రెంచ్‌ను తన రచనాభాషగా ఎంచుకున్నాడు. దానికి ఆయన చెప్పిన కారణాలు సాధారణంగా రచయితలు కోరుకునే లక్షణాలకు పూర్తి విరుద్ధమైనవి. తన మాతృభాషకు దూరం కావడం అనేది, ఒక ముసుగును చించుకోవడంతో సమానంగా చూశాడు. ఫ్రెంచ్‌లో (పరాయి భాష) మాత్రమే ఒక శైలి లేకుండా రాయడం సాధ్యమవుతుందన్నాడు. అలాగైతేనే తనకు తగిన వనరులు లేకుండా పోతాయన్నాడు. అందువల్లేనేమో, ఆయన ప్రసిద్ధ 'మినిమలిస్ట్' రచయిత కాగలిగాడు. వేర్వేరు కారణాల వల్ల తమ మాతృభాషలకు దూరమైన రచయితలు ఎందరో ఉన్నారు. పరిస్థితులు వారికి అలాంటి పరీక్ష పెట్టాయి. ఆ వేదన ఇక్కడ అప్రస్తుతం. కానీ భాష అనేదాన్ని ఒక అవరోధంగా పెట్టుకుని రాయాలనుకోవడం దానికదే ఒక సవాలు. ప్రాణవాయువును మరీ ఎక్కువగా పీల్చకుండా పొదుపుగా వాడుకుంటూ బతికే యోగసాధన లాంటిది అది.

# రైలు ప్రయాణం మెరుగుపడేదెప్పుడు?




**సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్లీపర్ క్లోచ్‌లలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బోగీలలో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఉండటం వలన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ.**

**భారతీయ ఆర్థికవ్యవస్థకు రైల్వే విభాగం జీవనాడి వంటిది. ఏటా రైలు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ దానికి తగ్గట్టుగా మౌలిక సదుపాయాల కల్పన పెరగటం లేదు. ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణికులు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. మెట్రో నగరాల్లో రైల్వే బ్రిడ్జిలు రద్దీగా ఉండి ప్లాట్‌ఫాం మొదలు నుంచి చివరి వరకు చేరుకునేందుకు కనీసం 15 నిమిషాలు పడుతున్నది. రద్దీ సమయాల్లో లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయక పోవడం నిత్యకృత్యం.**

సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయడం, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్లీపర్ క్లోచ్‌లలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బోగీలలో కెపాసిటీకి మించిన ప్రయాణికులు ఉండటం వలన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ. మూత్రశాలల్లో నీరు లేకపోవడం, భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నదని ప్రయాణికులు వాపోతుండటం గమనార్హం. బోగీల్లో అపరిశుభ్రత ప్రయాణికుల ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నది. ఒకే రైలును పేరు మార్చి వివిధ రూట్లలో తిప్పడం వల్ల బోగీలను, టాయ్ లెట్లను శుభ్రపరచడం, బెర్తులు, సీట్లు, చెడిపోయిన నల్లాలు, పైపుల మరమ్మతు చేసే సమయం కూడా ఉండటం లేదని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. ఒక్కోసారి ఎటువంటి ముందస్తు సూచనలు తెలపకుండా ప్యాసింజర్ రైళ్లు రద్దుచేయడం లేదా ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యం తగ్గించడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ వారంలో మిగ్‌జాం తుఫాన్ వల్ల రైళ్లు రద్దుచేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రద్దుచేయడం మంచిదే, కానీ, తుపాన్ ప్రభావం లేని ఖాజీపేట, విజయవాడ జంక్షన్ల మధ్య ప్రతిరోజు నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా కేంద్రంలోని పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వారు కేవలం హామీలు, గ్యారంటీలకు పరిమితమయ్యారు. రైల్వేలు ప్రజల సొమ్ముతో నిర్మించినవి. అందుబాటు ధరల్లో సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రజల వద్ద వసూలు చేసిన పన్నులు ద్వారా వచ్చిన సొమ్ముతో ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరచాలి. వయో వృద్ధులకు గతంలో ఇచ్చిన రాయతీలు పునరుద్ధరించాలి. కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో చంద్రయాన్‌కు రాకెట్ పంపినప్పుడు అంతకన్నా తక్కువ ఖర్చుతో రైళ్ల సంఖ్య పెంచి స్టేషన్లలో మౌలిక సదుపాయాలు, నూతన ప్యాసింజర్ రైళ్లు, బోగీల సంఖ్య పెంచవచ్చు. సుఖవంతమైన, ఎటువంటి అసౌకర్యం లేకుండా పరిశుభ్రమైన రైలు ప్రయాణం చేసినప్పుడే 'స్వచ్ఛ రైల్- స్వచ్ఛ్ భారత్' నినాదానికి సార్థకత ఏర్పడుతుంది. ఈ దిశగా రైల్వే అధికారులు దృష్టి సారించాలి.

# వివాదాస్పద భవంతి



పోలండ్‌లోని నోటెకా అభయారణ్యంలో ఈ భవంతి నిర్మాణం వివాదాస్పదంగా మారింది. నదిలో కృత్రిమ దీవిని ఏర్పాటు చేసుకుని, దానిపై మధ్యయుగాల శైలిలో దాదాపు ఎనిమిదేళ్లుగా నిర్మిస్తున్న ఈ భవంతి గురించిన వివరాలు ఇప్పటికీ పూర్తిగా ఎవరికీ తెలియవు. ఎవరు ఎందుకు ఈ భవంతిని నిర్మిస్తున్నారనే దానిపై అనేక వదంతులు ప్రచారంలో ఉన్నాయి. ఈ భవంతి నిర్మాణాన్ని 2015లో ప్రారంభించారు. దీని నిర్మాణం దాదాపు పూర్తయ్యే దశలో ఉంది. ఇది 2025 నాటికి పూర్తి కాగలదని అంచనా. అభయారణ్యంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ భవంతి గురించి జనాలకు కొంత ఆలస్యంగా తెలిసింది. దీనిపై స్థానిక పర్యావరణవేత్తలు గగ్గోలు చేయడంతో 2020లో ఏడుగురు కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. ఏళ్ల తరబడి నిర్మాణం సాగుతున్నా, దీనిపై పట్టించుకోనందుకు స్థానిక గవర్నర్‌కు పదవి ఊడింది.

అయినా, ఈ భవంతి నిర్మాణం వెనుక ఎవరు ఉన్నారనేది మాత్రం స్పష్టంగా బయటపడలేదు. ఈ పరిణామాల తర్వాత కూడా ఈ భవంతి నిర్మాణం యథా ప్రకారం కొనసాగుతూనే ఉంది. ఈ భవంతి నిర్మాణానికి దాదాపు 75 మిలియన్ పౌండ్లు (రూ.78.94 కోట్లు) ఖర్చవుతుందని ఒక అంచనా. ఈ భవంతి నిర్మాణం వెనుక జాన్ కుల్సిక్ అనే పోలిష్ కోటీశ్వరుడు ఉన్నట్లు ఒక వదంతి ప్రచారంలో ఉంది.

నిజానికి అతడు ఈ నిర్మాణం ప్రారంభించే నాటికే 2015లో మరణించాడు. అయితే, తాను జీవించి ఉండగానే, మరణించినట్లు ప్రచారం చేసుకుని, తెరవెనుక ఉండి ఈ నిర్మాణం కొనసాగిస్తున్నాడనే ప్రచారం బలంగా ఉంది. పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ నిర్మాణాన్ని నిలిపివేయడానికి పోలిష్ అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా, అవేవీ నెరవేరలేదు. అలాగే ఈ నిర్మాణం వెనుక ఎవరున్నారో, దీనిని ఏ ఉద్దేశంతో నిర్మిస్తున్నారో ఇప్పటి వరకు బయటపడకపోవడమే

# 2023లో గూగుల్‌లో అత్యధికంగా ఏ ఫుడ్ కోసం వెతికారో తెలుసా?



ఈ ఏడాది ముగింపు దశకు చేరుకుంది. మరికొన్ని రోజుల్లోనే 2024లో అడుగు పెట్టబోతున్నాం. కొత్త ఏడాదికి స్వాగతం పలకడానికి అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. 2023లో ఫ్యాషన్, బ్యూటీ, ఫుడ్ విషయంలో అనేక కొత్త ట్రెండ్స్ వెలుగులోకి వచ్చాయి. ఈ ఏడాది ఫుడ్ రెసిపిల్లోనూ వెరైటీ ప్రయోగాలెన్నో చూశాం. అలా 2023లో గూగుల్‌లో అత్యధికంగా సెర్చ్ చేసిన 10 ఆహార పదార్థాలుఏంటో చూసేద్దాం.

### మిల్లెట్స్

2023 సంవత్సరంలో గూగుల్‌లో అత్యధికంగా సెర్చ్ చేసిన ఆహార పదార్థాల్లో మిల్లెట్స్? పేరు ముందుంది. మిల్లెట్స్ తయారీ విధానం, దాని ప్రయోజనాలు తెలుసుకోవడానికి నెటిజన్లు ఎక్కువగా ఇంట్రెస్ట్ చూపించారు. దీనికి ప్రధాన కారణం.. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్, ఐక్యరాజ్యసమితి 2023ని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించడమే.

### అవకాడో

అవకాడో ఒక అమెరికన్ ఫ్రూట్. దీన్ని తెలుగులో వెన్నపండు అంటారు. గూగుల్‌లో అత్యధికంగా వెతిక ఆహార పదార్థాల్లో అవకాడో ఒకటి. అవకాడలో విటమిన్లు, ఖనిజాలు, పోషకాలు పుష్కలంగా ఉండటం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఈ ఫ్రూట్‌కి బాగా డిమాండ్ ఉంది. అరటిపండు కంటే అవోకాడోలో ఎక్కువ పొటాషియం ఉంది. అవకాడో తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ నుంచి డిన్నర్ వరకు అవకాడోను పలు స్మూతీల్లో, సలాడ్స్‌లో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇది కాస్త కాస్ట్‌లీ అయినప్పటికీ అవకాడోలోని పోషకాలు, హెల్తీ ఫ్యాట్ ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఈ కారణంగానే గూగుల్ మోస్ట్ సెర్చ్‌డ్ ఫుడ్ ఐటెమ్స్‌లో ఒకటిగా నిలిచింది.

### మటన్ రోగన్ జోష్

గూగుల్‌లో ఎక్కువగా సెర్చ్ చేసిన ఫుడ్ ఐటమ్స్‌లో మటన్ రోగన్ జోష్ మూడో స్థానం దక్కించుకుంది. ఇది పాపులర్ కశ్మీరీ వంటకం. నాన్ లేదా రైస్‌తో తినే ఈ స్పైసీ ఫుడ్‌కు మంచి ఆదరణ ఉంది. ఈ ఏడాది ఎక్కవుగా సెర్చ్ చేసిన టాప్-3 ఐటెం ఇది.

### కతి రోల్స్

2023లో గూగుల్‌లో ఎక్కువగా వెతికిన ఆహార పదార్థాల్లో కతి రోల్స్ నాలుగో స్థానంలో నిలిచింది. కోల్‌కతాలోని పాపులర్ స్ట్రీట్‌ఫుడ్స్‌లో ఇది ఒకటి. రోల్స్‌లో స్టఫింగ్ కోసం వెజ్ లేదా నాన్‌వెజ్‌ను ఎంచుకోవచ్చు. వీటిని చట్నీ లేదా సాస్‌తో వడ్డిస్తారు.

### టిన్డ్ ఫిష్

చేపల్లో ప్రోటీన్, ఒమేగా-2 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయన్న విషయం తెలిసిందే. 2023లో ఎక్కువగా సెర్చ్ చేసిన వంటకాల్లో టిన్డ్ ఫిష్ కూడా ఉంది. సలాడ్,శాండ్‌విచ్, పాస్తా,,క్యాస్రోల్ వంటకాల్లో ఎక్కువగా టిన్డ్ ఫిష్‌ను ఉపయోగిస్తారు.





Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710